

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 34 | మంగళవారం 03 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3

## పసిడి ప్రియులకు శుభవార్త..



తులం బంగారంపై ఒక్కరోజే రూ.9,050 పతనం
కిలో వెండిపై ఏకంగా రూ.50,000 తగ్గుదల
లాభాల స్వీకరణతోనే తగ్గుతున్నాయని అంచనా

2లో

బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరిన తర్వాత, గత నాలుగైదు రోజులుగా పసిడి, వెండి ధరలు నేలచూస్తున్నాయి.



# హింస సృష్టించేందుకు వైసీపీ కుట్ర

ఏపీ ప్రజలు, నేతలకు చంద్రబాబు హెచ్చరిక...
వైసీపీలో అసహనం పెరిగిపోయిందన్న సీఎం...
జగన్ పార్టీ పాపాలను దారిమళ్లించే కుట్ర అన్న చంద్రబాబు

2లో

ఏపీలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రతిపక్ష వైసీపీ వ్యవహరిస్తోందని, అధికారం కోల్పోయిన నిరాశతో ఆ పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో అలజడి సృష్టించడమే లక్ష్యంగా వైసీపీ నేతలు బూతులు, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దిగుతున్నారని ఆయన మండిపడ్డారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, రాజకీయ పరిణామాలపై దిశానిర్దేశం చేశారు. టెలీకాన్ఫరెన్స్ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైసీపీ అడ్డంగా దొరికిపోయిందని ఆరోపించారు.

# తిరుమల లడ్డూపై ఎందుకు మాట్లాడరు

వైకాపా ట్రాప్‌లో పడకండి
పార్టీ శ్రేణులకు జనసేనాని హితవు

జనసేన పార్టీ జనరల్ బాడీ సమావేశం వేదికగా పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పార్టీ నేతలపై అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తిరుమల లడ్డూ వ్యవహారం గురించి వైసీపీ చేస్తున్న విమర్శల ధాటిని తిప్పికొట్టడంలో నేతలు విఫలమవుతున్నారని ఆయన అన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కీలక సమావేశంలో




2లో



## చీరల గురించి కాదు.. బడ్జెట్‌పై చర్చించండి

సోషల్ మీడియా వార్తలపై నిర్మలమ్మ అసహనం

2లో

ఏటా బడ్జెట్ వేళ ఆర్థిక కేటాయింపుల పైనే కాకుండా.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించే చీరల పైనా అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే ఆమె చేనేతకు సంబంధించిన ప్రత్యేకించిన చీరలను ధరిస్తారు. అలాగే ఎంతో హుందాగా దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఏటా ఆమె ధరించే చీరలపై చర్చ సాగుతూనే ఉంటుంది. దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా ఆమె ఎంచుకునే చీరల పైనా చర్చలు జరుగుతాయి. ప్రతి ఏడాది బడ్జెట్ సమయంలో తన చీరలపై జరుగుతోన్న చర్చలపై ఆర్థికమంత్రి అసహనం వ్యక్తంచేశారు. ప్రతి సంవత్సరం బడ్జెట్రోజు నేను ఏం ధరించబోతున్నా ననే ప్రశ్నలు నాకు ఒత్తిడిగా మారుతున్నాయన్నారు. 'ఎందుకు ఇలా ప్రశ్నలతో వేధిస్తున్నారు? ఒకవేళ బ్జడెట్ ప్రవేశపెట్టేది పురుష మంత్రులైతే వారిని కూడా



2లో

# కావాలనే ఏపీలో అల్లర్లకు వైసిపి కుట్ర

శాంతిభద్రతలు సమస్య సృష్టించే పన్నాగం
బీజేపీ ఎంపీలు సీఎం రమేశ్, పురందేశ్వరిల ఆగ్రహం

ఏపీలో కావాలనే జగన్ అండ్ కో అల్లర్లు సృష్టించారని బీజేపీ ఎంపీలు సీఎం రమేశ్, పురంధేశ్వరిలు మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించాలన్న కుట్రలు బయటపడ్డాయని అన్నారు. జగన్ కనుసన్నల్లోనే జోగి రమేశ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఎంపీ సీఎం రమేశ్ ధ్వజమెత్తారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో శాంతిభద్రతలు ఉన్నాయా లేదా అనేది కేంద్ర ప్రభుత్వానికి తెలుసన్నారు. మూడు రోజుల నుంచి ఏపీలో జరుగుతున్న పరిణామాలు చూస్తున్నామన్నారు. అంబటి, జోగి రమేశ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబుది కన్‌స్ట్రక్టివ్ మోడ్.. జగన్‌ది డిస్ట్రక్టివ్ మోడ్ అని ఎంపీ రమేశ్ విమర్శించారు.

## భారత్ కు శుభవార్త చెప్పిన ట్రంప్.



# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్



# జోగి రమేశ్ బెయిల్ రద్దు చేయాలని సిట్ పిటిషన్

నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్‌కు షాక్
ఆయన బెయిల్ రద్దు చేయాలని కోర్టును ఆశ్రయించిన సిట్
సాక్ష్యాధారాలు తారుమారు చేసే ప్రమాదం ఉందని ఆరోపణ
ఇటీవల బెయిల్‌పై విడుదలై సీఎంపై వ్యాఖ్యలు చేసిన జోగి
తాజా పరిణామంతో మళ్లీ రాజుకున్న రాజకీయ వేడి

వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్‌కు నకిలీ మద్యం కేసులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు ఇటీవల మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విజయవాడ ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జోగి రమేశ్ బయట ఉంటే సాక్షులను ప్రభావితం చేస్తారని, సాక్ష్యాధారాలను తారుమారు చేసే ప్రమాదం ఉందని సిట్ తన పిటిషన్‌లో ఆరోపించింది. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగే అవకాశం ఉంది.నకిలీ మద్యం తయారీ, విక్రయాల కేసుకు సంబంధించి జోగి రమేశ్‌తో పాటు ఆయన సోదరుడు జోగి రామును గతంలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో వారు 83 రోజుల పాటు రిమాండ్‌లో ఉన్నారు. ఇటీవలే అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి కోర్టు వారికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు.అయితే, జైలు నుంచి విడుదలైన తర్వాత జోగి రమేశ్..

# కులం కాదు.. గుణం చూసి ఓటేయండి

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



2లో

భారత్ సరిహద్దుల్లోకి చైనా చొరబాట్లు
ఆర్మీ మాజీ చీఫ్ నరవణెళి పుస్తకంలో వెల్లడి
సభలో మాట్అలాడకుండా అడ్డుకున్నారు: రాహుల్

2లో



## బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

భారత సరిహద్దుల్లోకి చైనా సైన్యం చొరబడుతోందనే మాటలు తాను చెప్పినవి కావని, స్వయంగా ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణెళి తన పుస్తకంలో రాసినవేనని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ తెలిపారు. వాస్తవాలు బయటకు రాకూడదనే ఉద్దేశంతోనే ఆ పుస్తక ప్రచురణను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. జాతీయ భద్రతకు సంబంధించిన విషయాలు చెబుతాననే భయంతోనే లోక్‌సభలో తన ప్రసంగం మొదట్లోనే అడ్డుకున్నారని చెప్పారు. లోక్‌సభ వాయిదా పడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మాజీ ఆర్మీ చీఫ్ పుస్తకం బయటకు వస్తే మన సైన్యాన్ని ప్రభుత్వ నేతలు ఎలా నిరాశపరుస్తున్నరనేది ప్రజలు తెలుసుకుంటారని చెప్పారు.మాజీ ఆర్మీ చీఫ్ తన దృష్టికోణాన్ని ఎందుకు చెప్పుకూడదు? ఆయన ఏమి చెప్పి ఉంటారని ప్రభుత్వం భయపడుతోంది? అని రాహుల్ ప్రశ్నించారు. 'ప్రధాన మంత్రి గురించి, రాజ్‌నాథ్ సింగ్ గురించి పుస్తకంలో స్పష్టంగా రాశారని నేను చెప్పదలచుకున్నాను. ఒక ఆర్టికల్‌లో కూడా ఈ విషయం వచ్చింది. నేను ఆ ఆర్టికల్‌ను ప్రస్తావించాను. దాంతో నన్ను మాట్లాడకుండా అడ్డుకున్నారు. అసలు విషయాలు బయటకు వస్తాయనే భయమే అందుకు కారణం. మాజీ ఆర్మీ చీఫ్ తన పుస్తకంలో ఏమి రాశారో, ఆయనకు రాజ్‌నాథ్ సింగ్, ప్రధాని మోదీ ఏ ఆదేశాలు ఇచ్చారో, వారి మధ్య జరిగిన సంభాషణలు ఏమిటో సభలో చెప్పాలనుకున్నాను. కానీ రెండు,మూడు లైన్లు మాట్లాడగానే నన్ను ప్రసంగించకుండా అడ్డుకున్నారు' అని రాహుల్ తెలిపారు.

## పసిడి ప్రియులకు శుభవార్త..

ఈ క్రమంలో ఇవాళ ఒక్కరోజే బంగారం ధర రికార్డు స్థాయిలో పడిపోయింది. ఈ పరిణామం పెట్టుబడిదారులకు షాక్ ఇవ్వగా, కొనుగోలుదారులకు ఊరటనిచ్చింది. ఈరోజు (ఫిబ్రవరి 2) ఉదయం 9:30 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ. 9,050 తగ్గి రూ. 1,51,530కి చేరింది. అలాగే, 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 8,300 తగ్గి రూ. 1,38,900 వద్ద ట్రేడ్ అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా దాదాపు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అక్కడ 24 క్యారెట్ల పసిడి ధర రూ. 1,51,680గా నమోదైంది. పసిడి బాటలోనే వెండి బంగారం బాటలోనే వెండి కూడా పయనిస్తోంది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే ఏకంగా రూ. 50,000 పతనమైంది. ప్రస్తుతం హైదరాబాద్, ఢిల్లీ మార్కెట్లలో కిలో వెండి ధర రూ. 3 లక్షల వద్ద ఉంది. కొద్ది రోజుల క్రితం కిలో వెండి ధర రూ. 4.25 లక్షల వరకు చేరడం గమనార్హం. ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరడంతో పెట్టుబడిదారులు భారీ ఎత్తున లాభాల స్వీకరణకు (ప్రాఫిట్ బుకింగ్) మొగ్గు చూపడమే ఈ పతనానికి ప్రధాన కారణంగా బులియన్ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ధరల పతనం పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తుండగా, కొనుగోలు చేయాలనుకునే వారికి ఊరటనిస్తోంది.

## రాహుల్‌ను అడ్డుకోవడం సరికాదు

### చెప్పాల్సిన విషయం చెప్పకుండా పోయింది

### లోక్‌సభలో ప్రభుత్వ తీరును తప్పుపట్టిన శశిథరూర్

రాహుల్ గాంధీ లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై అధికార పక్షం అతిగా స్పందించిందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణెళి రాసిన పుస్తకం లోని విషయాలతో వచ్చిన ఒక ఆర్టికల్‌ను రాహుల్ తన ప్రసంగంలో ప్రస్తావిస్తుండగా అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం తలెత్తి సభ వాయిదా పడింది. అనంతరం మీడియా సమావేశంలో రాహుల్‌కు బాసటగా శశిథరూర్ స్పందించారు. తన ఆందోళనను బయటపెట్టే అవకాశం ఆయనకు ఎప్పుడూ రాలేదు' అని శశిథరూర్ పేర్కొన్నారు. ఆ కథనం బలగాలను కానీ సైనికులను కానీ తప్పుపట్టలేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న, తీసుకోకుండా పోయిన కొన్ని అంశాలను మాత్రమే రాహుల్ గాంధీ ప్రస్తావించాలనుకున్నారని, దానికి ప్రభుత్వం అంత అతిగా స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. రాహుల్ లేవనెత్తాలనుకున్న అంశం గురించి ప్రజలకు తెలిసిందేనని, ఆయన ఓ మ్యాగజైన్‌లో ప్రచురితమైన కథనంగా ఆధారంగానే మాట్లాడారని వివరించారు. ఆ పుస్తకం ప్రచురితం కాలేదని ప్రభుత్వం అభ్యంతరం చెప్పడానికి బదులుగా ఆయనకు మాట్లాడే అవకాశం ఇచ్చి ఉండాల్సి ఉందని శశిథరూర్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అతిగా స్పందించాల్సిన అవసరం లేదు. అది సభ వాయిదాకు దారితీసింది. చర్చ కొనసాగించి ఉంటే పార్లమెంటులో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రతిబింబించి ఉండేది. నిజాలు తప్పయితే నిజాలను సవరించాలి. కానీ నిజాలను ప్రసారం కాకుండా అడ్డుకోకూడదు' అని శశిథరూర్ వ్యాఖ్యానించారు. పండిట్ జవహర్‌లా నెహ్రూ హయాంలో పార్లమెంటులో జరిగిన కీలక చర్చను ఈ సందర్భంగా శశిథరూర్ ప్రస్తావించారు. 1962లో చైనా-భారత్ యుద్ధం జరుగుతుండగా పార్లమెంటు సమావేశమైందని, ఒకవైపు యుద్ధం జరుగుతుండగా చర్చలను పొడిగించి మరీ నిర్వహించారని చెప్పారు. 'అప్పుడు ఎలాంటి విప్‌లు లేవు. ప్రభుత్వ ఎంపీలు సైతం ప్రభుత్వాన్ని, ప్రధానమంత్రి నెహ్రూను సైతం విమర్శించగలిగే వారు' అని తెలిపారు. 1965, 1971 యుద్ధాల సమయంలోనూ పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి ఆ వివరాలను ఎంపీలతో పంచుకోవడం, దేశ ప్రజలను పరిగణనలోకి తీసుకోవడం జరిగిందని ఆయన వివరించారు.

## బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడి మాతృమూర్తికి ఘనంగా నివాళి

### మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి పులు వేసి నివాళ్లు అర్పించిన ములుగు జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ మరియు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి

**ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 2 ( నంది పత్రిక )** ములుగు జిల్లా బండారు పల్లీ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు కేశెట్టి కుటుంబరావు మాతృ మూర్తి అనారోగ్య సమస్య తో మరణించగా ఈ రోజువారి యొక్క స్వగృహానికి వెళ్ళి చిత్ర పటానికి పూలు వేసి నివాళ్లు అర్పించిన శ్రీమతి బడే నాగజ్యోతి గారు ఈ సందర్భంగా వారి యొక్క కుటుంబానికి తన యొక్క ప్రగడ సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో ములుగు మండల పార్టీ అధ్యక్షులు సనికొమ్ము రమేష్ రెడ్డి గారు జిల్లా నాయకులు వేములపల్లి, భిక్షపతి దొడ్డిపెల్లి రఘుపతి ,రామసహాయం శ్రీనివాస్ రెడ్డి గారు, కొగిల మహేష్,మంచర్ల నాగేశ్వరరావు అలాగే బండారుపల్లి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## పవన్‌పై బండ్ల గణేశ్ భక్తి.. పాటగా వచ్చేసింది!

నటుడు శివాజీ, సీనియర్ నటి లయ ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ కామెడీ చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో విడుదల కానుంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఈటీవీ విన్'లో ఈ నెల 12 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. విడుదల తేదీ దగ్గరపడటంతో ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, తాజాగా సినిమాలోని 'పాయా పాయా' అనే ప్రత్యేక గీతాన్ని విడుదల చేసింది. ఈ పాటలో ప్రముఖ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ తన డ్యాన్స్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## జోగి రమేశ్ బెయిల్ రద్దు చేయాలని సిట్ పిటిషన్

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన టీడీపీ కార్యకర్తలు ఇబ్రహీంపట్నంలోని ఆయన ఇంటిపై దాడి చేసి నిప్పుపెట్టారు. ఈ ఘటనపై సుమారు 40 మంది టీడీపీ నేతలపై కేసులు నమోదు కాగా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై జోగి రమేశ్‌పైనా పలుచోట్ల కేసులు నమోదయ్యాయి. ఈ రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో సిట్.. జోగి రమేశ్ బెయిల్‌ను రద్దు చేయాలని కోర్టును ఆశ్రయించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పిటిషన్‌పై కోర్టు తీర్పు ఎలా ఉండనుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## భారత్ కు శుభవార్త చెప్పిన ట్రంప్...

### ప్రధాని మోదీతో ట్రంప్ ఫోన్ కాల్

### అనంతరం ట్రూత్ సోషల్ లో పోస్టు

### టారిఫ్ లు 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గింపు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ ల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్ పై ఇంతకుముందు విధించిన ప్రతీకార టారిఫ్ లను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ లో పోస్టు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్ కాల్ ద్వారా మాట్లాడిన అనంతరం ఈ ప్రకటన వెలువడడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇంతకీ ట్రంప్ తన ప్రకటనలో ఏమని పేర్కొన్నారంటే... "ఈ ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) భారత ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. మోదీ నా గొప్ప స్నేహితుల్లో ఒకరు. ఆయన భారత్ లో అత్యంత శక్తిమంతమైన నేత. మేం ఇవాళ ఫోన్ కాల్ లో చాలా విషయాలు మాట్లాడుకున్నాం. వాణిజ్యం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు తదితర అంశాలు చర్చకు వచ్చాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేసేందుకు మోదీ అంగీకరించారు. అమెరికా నుంచి, దాంతో పాటే వెనెజువెలా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు. ఈ నిర్ణయం ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలుకుతుందని ఆశిస్తున్నాను. ప్రతి వారం వేలమంది చనిపోతున్న ఆ యుద్ధానికి ఈ నిర్ణయం చరమగీతం పాడుతుందని అనుకుంటున్నాను. మోదీతో స్నేహం, గౌరవం ఇవన్నీ కాకుండా... ఆయన విజ్ఞప్తి మేరకు అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందానికి ఆమోదం తెలిపాం. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇప్పటివరకు అమల్లో ఉన్న 25 శాతం టారిఫ్ లు 18 శాతానికి తగ్గుతాయి. అదే సమయంలో భారత్ వైపు నుంచి కూడా టారిఫ్ లు తగ్గుతాయనుకుంటున్నాను. దాంతోపాటే, పూర్తి పన్ను రహిత వాణిజ్యానికి ద్వారాలు తెరుచుకుంటాయని ఆశిస్తున్నాను. అమెరికా తయారీ వస్తువుల కొనుగోలు పట్ల కట్టుబడి ఉంటారని ప్రధాని మోదీ మాటిచ్చారు. ఈ వాణిజ్యం దాదాపు 500 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చు. ఇందులో ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయం, బొగ్గు తదితర ఉత్పత్తులు ఉన్నాయి. భారత్ తో అమెరికా అద్భుతమైన సంబంధాలు మరింత దృఢంగా ముందుకు వెళతాయి. నేను, ప్రధాని మోదీ ఈ ఒప్పందానికి ఓ రూపం కల్పించాం... ఇంతకుమించి ఎక్కువగా చెప్పలేం" అంటూ ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు.

## శ్రమశక్తి అవార్డు గ్రహీత, శానబోయిన అశోక్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు...



**ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 2 ( నంది పత్రిక)** తెలంగాణ ప్రభుత్వ, శ్రమశక్తి అవార్డు గ్రహీత, మాజీ ఎంపీటీసీ శానబోయిన అశోక్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు ములుగు మండలం ఇంచర్ల గ్రామం లో వారి స్వగృహంలో జరిగాయి. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకులు శానబోయిన వెంకట మల్లయ్య మాట్లాడుతూ .మీ నిరంతర కృషి, నిజాయితీ, సమాజం పట్ల మీకున్న నిబద్ధత ఎందరికో స్ఫూర్తి. ఈ ప్రత్యేక రోజు మీకు ఎన్నో ఆనందాలను, సంతృప్తిని ప్రసాదించాలని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలు, అభిమానులు, స్నేహితులు, ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి కేకుకట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ చిక్కుల రాములు, మాజీ సర్పంచ్ శానబోయిన వెంకటమల్లయ్య సీనియర్ ముదిరాజ్ రాష్ట్ర నాయకులు ,బి ఆర్ కె జిల్లా రిపోర్టర్ హరినాథ్, మత్స్యశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి, మోర రాజమౌళి, గాజ సురేష్, మత్స్యశాఖ మండల ఉపాధ్యక్షుడు గోల్కొండ సాంబయ్య, చిక్కుల దేవేందర్, బోయిని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నరవణె పుస్తకంలోని వ్యాఖ్యల ఉల్లేఖన

### లోక్‌సభలో రాహుల్ ప్రసంగంపై గందరగోళం

### అడ్డుకున్న మంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా

రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో సోమవారంనాడు గందరగోళం తలెత్తింది. విపక్ష నేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణెళి రాసిన పుస్తకంలోని ఒక వాక్యాన్ని ప్రస్తావించడంతో గందరగోళం చెలరేగింది. వెంటనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. నరవణెళి పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని, ప్రచురితం కాని పుస్తకం నుంచి వ్యాఖ్యలను పార్లమెంటరీ ప్రొసీడింగ్స్‌లో ఎలా ప్రస్తావిస్తారని నిలదీశారు. సబ్జెక్ట్‌పై మాట్లాడాలన్నారు. రాజ్‌నాథ్ సింగ్ లేవనెత్తిన అభ్యంతరాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సమర్థించారు. 'మ్యాగజైన్ ఏదైనా రాయవచ్చు. పుస్తకం అధికారికంగా ప్రచురితం కానప్పుడు దానికి విశ్వసనీయత ఉండదు' అని అన్నారు. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాహుల్ మాట్లాడటం సరికాదన్నారు. పార్లమెంటరీ విధివిధానాలను పాటించాలని సూచించారు. దీంతో స్పీకర్ జోక్యం చేసుకుని ఆ పుస్తకం ఎక్కడుందో చూపించాలని అడిగారు. ప్రతిపక్ష నేతగా మీరు ఆరోపణలు చేస్తున్నారే కానీ సభ నిబంధనలను పాటించడం లేదన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. దీంతో రాహుల్ వెంటనే స్పందించారు. 'ఏమి మాట్లాడమంటారో దయచేసి మీరే చెప్పండి' అన్నారు. దీనిపై స్పీకర్ వెంటనే జవాబిచ్చారు. నేను మీ సలహాదారుని కాదు. స్పీకర్‌గా సభ సజావుగా సాగేలా చూడటం నా బాధ్యత. నిర్దేశిరచిన సబ్జెక్ట్ మీదే చర్చ ఉండాలి' అన్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

## చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... అద్దంకి పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చెందిన షేక్ ఖాదర్‌బాషా(40) ఫొటో స్టుడియో నిర్వహిస్తున్నాడు. అప్పుల బాధతో జనవరి 27వ తేదీ రాత్రి స్టుడియో వద్ద కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకొని తాగి ఇంటికి వెళ్లాడు. వాంతులు చేసుకుంటుండగా భార్య ప్రశ్నించటంతో విషయం చెప్పాడు.

## హింస సృష్టించేందుకు వైసీపీ కుట్ర

ఈ అంశంలో నిజాలు వెలుగులోకి రావడంతో రాష్ట్ర ప్రజలంతా వైసీపీని తీవ్రంగా విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆగ్రహం నుంచి తప్పించుకోవడం, తమ తప్పులను దాచిపెట్టడం కోసమే వైసీపీ కొత్త కుట్రలకు పాల్పడుతోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు హింసాత్మక వాతావరణాన్ని సృష్టించాలన్నదే వారి ఉద్దేశమని ఆయన ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. పెట్టుబడులు ఆకర్షించి ఉపాధి అవకాశాలు పెంచడం, ఆర్థిక పురోగతికి బాటలు వేయడమే టీడీపీ ప్రభుత్వ అజెండా అని తెలిపారు.

**అభివృద్ధి నచ్చని వైసీపీ** ఏపీ అభివృద్ధి దిశ వైసీపీ నేతలకు నచ్చడం లేదని, అందుకే ప్రభుత్వ కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని చంద్రబాబు అన్నారు. రాష్ట్రం ముందుకు సాగకుండా చేయాలనే రాజకీయ ద్వేషంతోనే ప్రతిపక్షం వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. తప్పు చేసిన వారెవరైనా సరే చట్టం తన పని తాను చేసుకుపోతుందని చంద్రబాబు స్పష్టంచేశారు. చట్టానికి అతీతంగా వ్యవహరించిన ప్రతి ఒక్కరినీ న్యాయపరంగా శిక్షించి తీరుతామని హెచ్చరించారు. అదే సమయంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు సంయమనం పాటించాలని ఆయన సూచించారు. వైసీపీ రెచ్చగొట్టే వ్యాఖ్యలకు స్పందించి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, అలాంటి ట్రాప్‌లో పడితే మనకూ వారికీ తేడా ఉండదని చంద్రబాబు హెచ్చరించారు. పార్టీ కార్యకర్తల ప్రవర్తనపై ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని మంత్రులు, సీనియర్ నేతలకు సీఎం సూచించారు. ఎక్కడా హింస, విధ్వంసం జరగకుండా చూసే బాధ్యత నాయకులదేనని పేర్కొన్నారు. కార్యకర్తలు భావోద్వేగాలకు లోనుకాకుండా, చట్ట పరిధిలోనే స్పందించేలా నాయకులు మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. శాంతి భద్రతలు దెబ్బతింటే రాష్ట్ర ప్రతిష్ఠకే మచ్చ పడుతుందని ఆయన గుర్తుచేశారు. వైసీపీ రాజకీయ సంస్కృతిపై కూడా చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై ఆ పార్టీ రాజకీయాలు నిర్మితమయ్యాయని ఆరోపించారు. అలాంటి రాజకీయాల ఉచ్చులో టీడీపీ కార్యకర్తలు పడితే, ప్రజల ముందు నైతిక ఆధిక్యత కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రజల విశ్వాసమే టీడీపీ బలం అని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని పేర్కొన్నారు.

## చీరల గురించి కాదు.. బడ్జెట్‌పై చర్చించండి

ఇలాగే వారి దుస్తుల గురించి అడిగేవారా? నేను ధరించే చీరను కూడా బ్జడెట్‌లో ఒక అంశంలా మార్చేస్తున్నారు' అంటూ సీతారామన్ అసహనం వ్యక్తంచేశారు.బడ్జెట్లో ఉన్న అంశాలు ఏమిటి అనే విషయాలను తెలుసుకోవడంపై ప్రజలు దృష్టి పెట్టాలని.. తన చీరలపై కాదని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి అనవసర విషయాల గురించి ఆలోచించడం వల్ల ముఖ్యమైన విషయాలపై పట్టు కోల్పోతామన్నారు. కాగా ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేళ ఆమె కాంచీపురం చీరలో కన్పించారు. బంగారు, కాఫీ వర్ణం అంచుతో ఉన్న మెజెంటా రంగు చీర, గోల్డెన్ కలర్ బ్లౌజ్, శాలువాతో కన్పించారు. అది తమిళనాడు నేపథ్యం ఉన్న చీర. కొన్ని నెలల్లో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఆమె కాంచీపురం చీరను ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై నెట్టింట చర్చ జరుగుతోన్న సమయంలో నిర్మలా సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం

## తిరుమల లడ్డూపై ఎందుకు మాట్లాడరు

పవన్ కళ్యాణ్.. పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, పీఏసీ సభ్యుల తీరుపై ఘాటుగా స్పందించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఇంత జరుగుతున్నా ఒక్కరూ ఎందుకు మాట్లాడటం లేదన్నారు. అన్నింటికీ నేనే సమాధానం చెప్పాలా అన్నారు. అలాంటప్పుడు మీరు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఎందుకు ఉన్నట్టు అని పవన్ ప్రశ్నించారు. వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతారని, అప్రమత్తంగా ఉండి వారి కుతంత్రాలను తిప్పికొట్టాలని సూచించారు. నేతల వ్యక్తిగత వ్యవహారాల వల్ల పార్టీకి నష్టం కలగకూడదని, సిద్ధాంత పరంగా, సబ్జెక్ట్ పరంగా మాత్రమే మాట్లాడాలని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ భవిష్యత్ కార్యాచరణను వివరించారు. తిరుమల లడ్డూ అపవిత్రత, కేంద్ర బ్జడెట్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తీర్మానాలు చేశామని వెల్లడించారు. జగన్ హయాంలో శ్రీవారి సొమ్ము రూ. 233 కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. మార్చి 14 నపార్టీ ఆవిర్భావ దినోత్సవం లోపు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. 32 మందితో క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, అలాగే పొలిటికల్ అ్గ÷ర్స్ కమిటీని పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నేత, ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ వివాదంపై చర్చించామని, కమిటీ రిపోర్ట్ ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

## కావాలనే ఏపీలో అల్లర్లకు వైసిపి కుట్ర

కావాలనే వైసీపీ నేతలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని రమేశ్ అయ్యారు. వైసీపీ ట్రాప్‌లో ఎవరూ పడొద్దని సూచించారు. కూటమి నేతలు ఎవరూ తప్పు చేయొద్దని కోరారు. సీఎం చంద్రబాబు ఏపీలో శాంతిభద్రతలను కాపాడుతున్నారని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు ఏపీలో సుపరిపాలన అందిస్తున్నారని వెల్లడించారు. ఏపీలో ఉండే వైసీపీ నాయకులకు బ్జడెట్‌పై ఏ మాత్రం అవగాహన లేదని ఎంపీ రమేశ్ అన్నారు. మరోసారి వారు బ్జడెట్ పూర్తిగా చదువుకోవాలని సూచించారు. వైసీపీ నేతలకు ఎంతసేపూ దోచుకోవాలి, దాచుకోవాలనే ఆలోచనేనని ఎంపీ రమేశ్ విమర్శలు చేశారు. సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై బీజేపీ రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా అంబటి వ్యాఖ్యలున్నాయని ధ్వజమెత్తారు. చంద్రబాబు తల్లిని అవమానించే విధంగా అంబటి మాట్లాడారని ఆగ్రహించారు. మహిళా లోకం కూడా ఆయన వ్యాఖ్యలను సహించదని తెలిపారు. ఇలాంటి దుశ్చర్యలను సభ్యసమాజం గర్హిస్తుందన్నారు.

## కులం కాదు.. గుణం చూసి ఓటేయండి

మున్సిపల్ ఎన్నికల్లో కులం కాదని.. గుణం చూసి ఓటేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పైసలు కాదని.. పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. మంచి అభ్యర్థులు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓటు వేయాలని కోరారు. తెలంగాణ జాగృతి తరఫున మంచి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం మీడియాతో కవిత మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎవరు నిలబడ్డ కారు గుర్తుపై ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారని ప్రస్తావించారు. చెడ్డ వాళ్లకి ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేటీఆర్ మాటలు నియంతృత్వం, రాచరికపు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు కుమ్మక్కు అయి.. నాటకాలాడుతున్నారని కవిత విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఫెయిర్‌గా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్‌ని సిట్ విచారణకు పిలిచిందని ప్రస్తావించారు. ఈ కేసులో సిట్ విచారణకు పిలిస్తే ఎవరైనా పోక తప్పదని కవిత స్పష్టం చేశారు. కేందప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో తెలంగాణకు మోదీ సర్కార్ అన్యాయం చేసిందని కవిత విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. గంజాయి ముఠా దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ ఫీజు సొంతంగా కట్టుకున్నారా..? ప్రభుత్వ సొమ్ముతో కట్టారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి ఎన్ని ఏంఓయూలు చేసుకున్నారని నిలదీశారు. ఫేక్ కంపెనీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ఫేక్ ఎంఓయూలపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. ఫేక్ ఏంఓయూలపై జాగృతి పోరాటం చేస్తుందని కవిత పేర్కొన్నారు.

# జాతీయస్థాయి దివ్యాంగ క్రీడా పోటీలకు ఎంపికైన నంద్యాల జిల్లా క్రీడాకారులు

**నెల్లూరులో రాష్ట్ర స్థాయి పారా స్పోర్ట్స్ లో విజేతలుగా నిలిచిన శ్రీనివాసులు,గౌతమ్,ఇమ్రాన్.**

**సత్కరించిన నంద్యాల లయన్స్ క్లబ్,నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్**



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 2 ( నంది పత్రిక )** నెల్లూరులో ఏ.సీ. సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పారా స్పోర్ట్స్ ( దివ్యాంగ క్రీడలు) అథ్లెటిక్ పోటీలలో నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున పాల్గొన్న చిందుకూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు డిస్కస్ త్రో, జావలిన్ రెండింటిలో బంగారు పతకం సాధించగా, రుద్రవరం కు చెందిన గౌతమ్ షాట్ పుట్ లో స్వర్ణ పతకం,జావలిన్ లో రజత పతకం అందుకోగా,ఆత్మకూరు కు చెందిన ఇమ్రాన్ లాంగ్ జంప్ లో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్, నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ సంఘం తరపున ముగ్గురు దివ్యాంగ క్రీడాకారులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల జిల్లా దివ్యాంగ క్రీడాకారులు రాష్ట్రస్థాయి దివ్యాంగ అథ్లెటిక్స్ పోటీలలో విజేతలుగా నిలిచి ఫిబ్రవరి నెలలో భువనేశ్వర్ లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొనడానికి ఎంపిక కావడం ప్రశంసనీయమన్నారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడానికి నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున ఆర్థిక సహకారం అందించడం జరిగిందని దానిని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభతో విజేతలుగా నిలవడం హర్షనీయమని అన్నారు. జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి కూడా సహకారం అందజేస్తామని ప్రకటించారు. జాతీయ స్థాయి పోటీలలో కూడా విజయం సాధించి రాష్ట్రానికి, నంద్యాల జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.దివ్యాంగులు క్రీడలలో పాల్గొనాలని ఆసక్తి ఉన్నవారు ముందుకు వస్తే వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేసి ప్రోత్సహిస్తామని అన్నారు. విజేతలుగా నిలిచిన దివ్యాంగ క్రీడాకారులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ తమకు అందిస్తున్న ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో డాక్టర్ రవికృష్ణ, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పి.వి.రమణయ్య, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ నిజాముద్దీన్,కోశాధికారి అమిదేల జనార్ధన్, సభ్యులు మేడా చంద్రశేఖర్, రామయ్య, కార్యాలయ కార్యదర్శి ఆలా మధు పాల్గొన్నారు.

# రోడ్డు పనులను పరిశీలించిన పంచాయతీరాజ్ అధికారులు



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 2 :** బండి ఆత్మకూరులో నీ మఠంపేటలో జరుగుతున్న రోడ్డు పనులను పంచాయతీ అధికారులు సోమవారం పరిశీలించారు. ఆంజనేయస్వామి గుడి పరిసరాల ప్రాంతంలో సిమెంట్ రోడ్డు వేసేందుకు గాను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి 5 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న రోడ్డు పనులను పంచాయతీలో డి ఈ అయాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకట్రాముడు డిప్యూటీ ఎంపీడీవో అన్నం పురుషోత్తం పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ అక్బర్ పరిశీలించారు. రెండు రోజుల క్రితం పూర్తయిన డ్రైనేజీ కాలువలను కూడా వారు పరిశీలించారు డ్రైనేజీ కాలువలకు నిత్యం క్యూరింగ్ చేయమని అసిస్టెంట్ వెంకట్రాముడు కాంట్రాక్టర్లకు సూచించారు. ఆంజనేయ స్వామి దేవాలయం నుండి కుందునది వరకు వేసిన డ్రైనేజీ కాలువలను కూడా వారు పరిశీలించారు. సిమెంట్ రోడ్డు వేసే ముందు మొరసు చెల్లించి రోలర్ ద్వారా చదును చేయమని ఏఈ వెంకట రాముడు సూచించారు. చదును చేసిన తర్వాతనే సిమెంటు రోడ్డు వేయమని కూడా సూచించడం జరిగింది. సచివాలయ ఇంజనీర్ చైతన్య పనితీరు పట్ల అసిస్టెంట్ వెంకటరమణ సంతృప్తి వ్యక్తం చేశారు.

# 20 ఏళ్ల అనుబంధానికి ఘన సమ్మేళనం.



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 2 ( నంది పత్రిక )** ఖలీల్ సిద్ధిఖి ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 20052006 విద్యా సంవత్సరం చదువుకున్న ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు తమ చదువు ముగిసి 20 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం స్థానిక ఎన్.జి.ఓ కాలనీలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా, భావోద్వేగ వాతావరణంలో సాగింది. దాదాపు 80 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్న ఈ సమ్మేళనానికి, అప్పట్లో విద్యార్థులకు విద్యాబోధన చేసిన కె. నాగేశ్వరరెడ్డి (విశ్రాంత ప్రధానోపాధ్యాయులు), మహబూబ్ , మదర్సా , షరీఫ్, ఇస్మాయిల్ హాజరై తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. అలాగే ఖలీల్ సిద్ధిఖి పాఠశాలల మేనేజర్ ముస్తాక్ మహమ్మద్ సిద్ధిఖి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు ఏసి హుద్దీన్ సిద్ధిఖి, ఉర్దూ ఉపాధ్యాయులు అంజద్ బాషా సిద్ధిఖి పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ జీవితాలకు పునాది వేసిన గురువులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతాభివందనం చేశారు. గురుశిష్య అనుబంధం, విద్య విలువలను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం సాగింది. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారంగా పూర్వ విద్యార్థులు చిరుకానుకగా ఒక డిజిటల్ స్మార్ట్ టీవీని పాఠశాలకు బహుమతిగా అందజేశారు. ఇది విద్యార్థుల బోధనకు ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్. చాంద్ బాషా, కె. ఆనంద్ కుమార్, వై. విజయ్ కుమార్, పి. మధు శేఖర్, కె. లోకేష్ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. చివరగా జాతీయ గీతంతో ఈ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా ముగిసింది.

# ఆంధ్రప్రదేశ్ జనతా వారధి కార్యక్రమం





**శ్రీశైలం ఫిబ్రవరి 02(నంది పత్రిక)** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ జనతా వారధి కార్యక్రమం లో భాగంగాశ్రీశైల మండలంలోని స్థానిక సుండిపెంట గ్రామం నందు రోడ్ల వెంట చెత్త చెదారం పేరుకుపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారతీయ జనతా పార్టీ శ్రీశైల మండల అధ్యక్షులు చదువుల శ్రీను తెలిపారు. చెత్తను సకాలంలో తొలగించకపోవడం కారణంగా గ్రామంలో దుర్వాసన,దోమలు,ఈగలు అధికంగా పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాల పిల్లలు, వృద్ధులు,మహిళలు ఈ సమస్య వల్ల ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామ పరిశుభ్రత లోపించడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలోని అవసరమైన ప్రదేశాలలో చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలని, అలాగే సకాలంలో చెత్తను సేకరించి,తరలించే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ తరపున సంబంధిత అధికారులను కోరుతూ ప్రజా పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వేములశ్రీను,చిక్కుడుచెట్టు వెంకటేశ్వర్లు,మండ్ల రామకృష్ణ, యేసుదాసు,చిత్రాల శివసాయి, ఆనంద్ మరియు ఇతర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# వీధి కుక్కల వ్యాధులపై ఎస్డిపిఐ ఆందోళన తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్.

**వీధి కుక్కల సంక్రమణ వ్యాధులతో ప్రజల్లో భయాందోళనలు.**

**వీధి కుక్కల గజ్జి, ఫంగల్ వ్యాధులు విజృంభణ ప్రజారోగ్యానికి ముప్పు.**





**వెలుగోడు, ఫిబ్రవరి 02 (నంది పత్రిక):** వెలుగోడు గ్రామ పంచాయతీ పరిధిలో అనేక వీధి కుక్కలకు గజ్జి (స్కేబీస్), ఫంగల్ ఇన్ఫెక్షన్ వంటి సంక్రమణ చర్మ వ్యాధులు తీవ్రంగా వ్యాపిస్తున్నాయి. ఈ వ్యాధిగ్రస్త వీధి కుక్కలు ప్రజా తిరిగే ప్రదేశాల్లో సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఇంకా, ఈ వ్యాధులు మనుషులకు కూడా సోకే ప్రమాదం ఉన్న కారణంగా ప్రజారోగ్య భద్రతకు ఇది తీవ్రమైన ముప్పుగా మారింది.ఈ సమస్యపై సోమవారం వెలుగోడులో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎస్డిపిఐ ప్రధాన కార్యదర్శి గౌస్, కార్యదర్శి తౌఫిక్, కమిటీ సభ్యులు ఇంతియాజ్, ఎమ్మార్వో శ్రీనివాస్ గౌడ్ కు మెమోరండం సమర్పించారు. కుక్కలకు తక్షణ వైద్య చికిత్స అందించడంతో పాటు, ప్రత్యేక వెటర్నరీ క్యాంపులు ఏర్పాటు చేసి, వ్యాధుల నియంత్రణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని. ఎస్డిపిఐ నాయకులు గట్టిగా డిమాండ్ చేశారు.ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం తమ బాధ్యత అని, ప్రజా సమస్యలపై ఎప్పుడూ ముందుండి పేదల పోరాడతామని ఎస్డిడిపిఐ నేతలు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్టిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



**కర్నూలు, నంది పత్రిక.....**అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క అర్జీ కూడా బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకూడదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అర్జీలు రీ ఓపెన్ కాకూడదన్నారు.. అదే విధంగా ఎట్ టు వ్యూ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను చూడాలని, అర్జీదారులతో మాట్లాడి, సమస్యలను పరిష్కరించాలని, ఎండార్స్మెంట్ స్పష్టంగా ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్, రెవెన్యూ క్లినిక్ ద్వారా వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ ద్వారా మొత్తం 238 అర్జీలు స్వీకరించగా, అందులో రెవెన్యూ క్లినిక్కు సంబంధించి 136 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# బడ్జెట్‌లో ఉద్యోగుల బకాయిలకు స్పష్టత ఇవ్వాలి

**మంత్రి ఫరూక్‌ను కలిసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం**



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 2 ( నంది పత్రిక )** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేల కోట్ల రూపాయల బకాయిలు, వేతన సవరణ, నాలుగు విడతల డి.ఏలు, సరెండర్ లీవులు తదితర ఆర్థిక ప్రయోజనాలపై 202627 రాష్ట్ర బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు చూపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంత్రి యన్.యం.డి. ఫరూక్‌ను సంఘ ప్రతినిధులు సోమవారం కలిశారు. ఇప్పటికే మంజూరైన బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని, లేదా ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాన్ని బడ్జెట్ ద్వారా వెల్లడించాలని కోరారు. అలాగే సిట్టింగ్ లేదా విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు, మధ్యంతర భృతి మంజూరు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ అంశాలపై ఎన్నికల హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, అవసరమైతే శాసనసభలో ప్రస్తావిస్తామని మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా, మహిళా విభాగం, పెన్షనర్ల విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.



# సిరివెళ్ల తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన సిపిఐ




**సిరివెళ్ల (నంది పత్రిక)** సిపిఐ డోన్ మండల కార్యదర్శి నారాయణ తిమ్మాపురం గ్రామ శాఖ కార్యదర్శి రమేష్ ల పైన సీఐ ఇంతియాజ్ భాషా.ఎస్సై నరేంద్ర చేసిన దాడిని ఖండిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శిరివెళ్ళ మండల సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ తాలూక కార్యదర్శి కామ్రేడ్ కే.భాస్కర్ అధ్యక్షత వహించారు.సిపిఐ రుద్రవరం కార్యదర్శ కామ్రేడ్ పి.బాల నరసింహులు పాల్గొన్నారు ఈ సందర్భంగా నిరసన కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నిస్తే జీర్ణించుకోలేని అధికార పార్టీ నాయకులు పోలీసు వారిని వాడుకుని సిపిఐ నాయకుల పైన దాడి చేయడం జరిగింది అధికార పార్టీ వాళ్ళకు తొత్తులుగా వ్యవహరిస్తున్న డోన్ సీఐ ఎస్ఐ ఇద్దరు కానిస్టేబుళ్లు సిపిఐ నాయకులు స్టేషన్కు పిలిపించుకొని.విచక్షణారహిత థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సరైన పద్ధతి కాదని విమర్శించారు.పోలీసులు మీకు నిజంగా ధైర్యం ఉంటే మైత్రి పోలీసింగ్ అని దంబాలు పలికే మీరు వీధికో ఒక బెల్టు షాపు నడుపుతూ ప్రజారోగ్యాన్ని గ్రామాల్లో యువతను నాశనం చేస్తున్న బెల్ట్ షాపు యజమానుల పైన కేసులు వేసి దాడులు చేసి ప్రజారోగ్యాన్ని యువతను కాపాడండి అలాంటి మంచి పనులు మీరెందుకు చేస్తారు అధికారంలో ఎవరు ఉంటే వాళ్ళ మాట వినడం వాళ్ళ అడుగులకు మడుగులుద్దడం కొందరు పోలీసులకు అలవాటుగా మారింది పోలీసు వారు గ్రహించి ఇలాంటి చర్యలు వృధావృతమై ప్రజల్లో పలుచన కావద్దని పోలీస్ వారికి విజ్ఞప్తి చేశారు.ఈ సంఘటపైన సమగ్ర విచారణ చేసి సీఐ ఇంతియాజ్ భాషను.ఎస్ఐ నరేంద్రను కానిస్టేబుల్ నాగరాజు ఇలా పైన చట్టపరమైన చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించి సస్పెండ్ చేయాలని కోరుతూ సమర్పించడం అయినది. ఈ కార్యక్రమంలో జి.మధు కే.పెద్దిరెడ్డి కే.పాములేటి డి.మౌలాలి జి.పెద్ద మధు యస్.రామలింగం ప్రవీణ్ మారి సుభాష్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## వెలుగోడు వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ఘనంగా ప్రమాణ స్వీకారం.




**వెలుగోడు, ఫిబ్రవరి 02 (నంది పత్రిక):** వెలుగోడు వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నంద్యాల పట్టణంలోని బాలాజీ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ నూతన అధ్యక్షులు బలుసా రాము, కార్యదర్శి తాళ్లూరి నాగరాజు, ఖజానాదారు నాగేళ్ల చంద్రశేఖర్‌లు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు.అదేవిధంగా వనిత స్ఫూర్తి వాసవి క్లబ్ నూతనవర్గంగా అధ్యక్షురాలు తాళ్లూరి విజయలక్ష్మి, కార్యదర్శి తల్ల అనురాధ, ఖజానాదారు సునీత కూడా ప్రమాణం స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా గవర్నర్ లింగం నాగ శైలజ, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాదం నాగేంద్ర, జోన్ చైర్మన్ తాళ్లూరి సంజీవరాయ ప్రసాద్ పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేసారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ప్రోగ్రామ్స్ క్యాలెండర్ ప్రకారం సేవా కార్యక్రమాలను వేగంగా అమలు చేసి, క్లబ్బులను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమం వాసవి క్లబ్ సభ్యులు, ఆహ్వానితుల సమక్షంలో ఉత్సాహభరితంగా జరిగింది.

## కార్పొరేట్ అనుకూల ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్ ను వ్యతిరేకించాలి




**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 02 . (నంది పత్రిక ):**నంద్యాల పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి వై నరసింహులు నంద్యాల డివిజన్ కార్యదర్శి ఎం శంకర్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో భారత ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన 9వ బడ్జెట్ కార్పొరేట్ అనుకూలంగా భారత ప్రజలకు వ్యతిరేకంగా ఉందని దీనిని ప్రజలు వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 53 వేల లక్షల కోట్లతో పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులు భారత ప్రజలను తీవ్రమైన నిరాశ నిస్పృహాలకు గురి చేసిందన్నారు. బడ్జెట్లో బడా పెట్టుబడిదారులకు కార్పొరేట్ కంపెనీలకు విదేశీ కంపెనీలకు నో టాక్స్ ప్రకటించటం వెనుక నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇటీవల వివిధ దేశాలతో చేసుకున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లో లో భాగమన్నారు. దీనివల్ల విదేశీ కంపెనీలు. ఫ్యాక్టరీలు దేశంలో విచ్చలవిడిగా పుట్టుకొచ్చి దేశంలో ఉన్న సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు మూసివేతకు గురిచేస్తాయన్నారు. దీనివల్ల దేశంలో మరింత ఆర్థిక అంతరాలు పెరిగి జీవనం అస్తవ్యస్త మ వృతున్న గ్రామీణ ప్రాంత పేదలకు ఈ బడ్జెట్ మొండి చెయ్యి చూపించిందన్నారు. గ్రామీణ అభివృద్ధికి కేటాయించిన 2. 73 లక్షల కోట్లు దేనికి సరిపోదు అన్నారు .ఒకవైపు 80 కోట్ల మందికి రేషన్ బియ్యం ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధిని పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు .వైద్య రంగానికి స్పష్టమైన నిధులు కేటాయింపులు చేయలేదన్నారు. వ్యవ వ్యవసాయ రంగానికి కేవలం 1.62 లక్షల కోట్లు కేటాయించిందని రైతాంగం డిమాండ్ చేస్తున్న గిట్టుబాటు ధర డిమాండ్ ను ఆటకెక్కించడమే అన్నారు రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వ ము పూర్తిగా విస్మరించిందని వాపోయారు . సూక్ష్మ పరిశ్రమలకు కేటాయించిన పదివేల కోట్లు దేశంలో ఏ మూలకు సరిపోవు అన్నారు పెరిగిన ధరలు. అధిక పనులు. నిరుద్యోగం దేశంలో తాండవిస్తున్న వాటిని అరికట్టడానికి చేసిన చర్యలు బడ్జెట్లో ఎక్కడ కనబడడం లేదన్నారు .ఈ కార్యక్రమంలో ఐ. ఎఫ్. టి .యు జిల్లా కోశాధికారి ఎస్ చౌ డప్ప . పి.డి .ఎస్ యు నంద్యాల జిల్లా కార్యదర్శి ఏ రాంబాబు .భవన నిర్మాణ కార్మిక సంఘం డివిజన్ నాయకులు ఎస్ రఫీ .పఠాన్ కాజనియా తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లా 21వ మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం జయప్రదం చేయండి.

**కర్నూలు నంది పత్రిక......** కర్నూల్ నగర ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు కర్నూల్లోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నగర అధ్యక్షులు బి వెంకటేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ము నెప్ప హాజరై ప్రసంగిస్తూఈనెల 3వ తేదీన మంగళవారం ఆలూరు ఉమా కళ్యాణమంటపంలో ఉదయం 10:30 నిమిషాలకు జరుగు కర్నూలు జిల్లా ఎఐటియుసి 21వ మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం జిల్లా అధ్యక్షుల కే.అజయ్ బాబా అధ్యక్షతన జరుగు తుందని ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జె. లలితమ్మ సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య గారు హాజరవుతున్నారు అని వారు తెలిపారు.ఈ సమావేశం చాలా ప్రాధాన్యతతో కూడుకున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్నటువంటి ఉద్యోగ కార్మిక, రైతు వ్యవసాయ కార్మికుల వ్యతిరేక విధానాల ను నిరసిస్తూ 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక హక్కుల కాలరాశి కార్పొరేట్లకు లాభం చేకూర్చే బిజెపి తీసుకొచ్చినటువంటి 4 లేబర్ కోడలనురద్దు చేయాలని, భారతదేశ వ్యవసాయ రంగానికి, రైతులకు నష్టం కలిగిస్తున్నటువంటి నూతన విత్తన చట్టాన్ని, నూతన విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, విబిజి రాంజీ గ్రామీణ ఉపాధి పథకాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని కొనసాగించాలని,ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26,000 నిర్ణయించి,కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కార్మికుల సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలని, కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలని 10 కేంద్ర కార్మిక సంఘాలు అఖిల భారత కిసాన్ సంయుక్త మోర్చా పిలుపుమేరకు ఫిబ్రవరి 12 జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని అలాగే జిల్లాలో ఉన్నటువంటి కార్మిక వర్గ సమస్యల కోసం జరుగు పోరాటాల గురించి చర్చించుకోవడం జరుగుతుందని కనుక ఈ సమావేశానికి హాజరు




కావలసినటువంటి ఏఐటియుసి జిల్లా నియోజకవర్గ మండల నాయకులు అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సకాలంలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయవలసిందిగా పత్రికాముఖంగా తెలియజేయుచున్నాము. ఈ సమావేశంలో ఏఐటిసి కర్నూల్ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్ ఉప ప్రధాన కార్యదర్శి టి రామాంజనేయులు నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ కృష్ణారెడ్డి హోటల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పురుషోత్తం రంగనాయకులు ఈశ్వర్ రెడ్డి పాల్గొనడం జరిగింది.

# ప్రతి ఫిర్యాదుకు సత్వరమే పరిష్కారం

### నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 29 అర్జీలు



**కర్నూల్ నంది పత్రిక.....** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదుకు సత్వరమే పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పీజిఆర్‌యస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాలకు సంబంధించి 29 అర్జీలు రాగా, వాటిని చట్టపరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ అర్జీదారులకు హామీనిచ్చారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, టిడ్కో అధికారి పెంచలయ్య, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.



# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం ...



**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ .**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 125 ఫిర్యాదులు.**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ.**

**కర్నూలు నంది పత్రిక.......** కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 125 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని** ... 1) ఇద్దరు వ్యక్తులు పరిచయమై ఎండోమెంట్ డిపార్ట్మెంట్లో ఉద్యోగశీ ఇప్పిస్తామని చెప్పి రూ. 10 లక్షలు తీసుకొని మోసం చేశారని పత్తికొండ , లక్ష్మీ నగర్ కు చెందిన లోకేష్ బాబు ఫిర్యాదు చేశారు.

2) ఎమ్మిగనూరు టౌన్ లో స్టేట్ బ్యాంక్ ప్రక్కన నాకు ఎస్ బి ఐ కస్టమర్ సర్వీస్ పాయింట్ ఉంది . సర్వీస్ పాయింట్ కు పగిడ్యాల మండల, పాతకోట కు చెందినముల్లా ముస్తాక్ వచ్చి మా అవ్వకు హాస్పిటల్లో సిరియస్ గా ఉందని, అర్జెంటు గా డబ్బులు అవసరం నిమిత్తం రూ. 1 లక్ష 10 వేలు ఫోన్ పే చేయాలని , డబ్బులు వేయించుకుని క్రెడిట్ కార్డు ద్వారా ఇస్తాను అని మభ్యపెట్టి రూ. 50 వేలు మాత్రమే ఇచ్చి మిగతా డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని గోనెగండ్ల మండలం , అల్వాల గ్రామానికి చెందిన చిన్న లక్ష్మన్న ఫిర్యాదు చేశారు 3) నా అల్లుడికి , నా స్నేహితుడు కుమారుడికి ఢిల్లీ, ముంబాయికి చెందిన ప్రవీణ్ బద్రీ నారాయణ కండేలేవాల్, మిథున్ దాస్ లు రైల్వే , ఇన్ కం ట్యాక్స్ , నామినేటెడ్ ఉద్యోగాలు, ప్రాజెక్టులలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి రూ. 20 లక్షలు తీసుకొని మోసం చేశారని కర్నూలు, బాలాజీ నగర్ కు చెందిన మన్సూర్ అహ్మద్ ఫిర్యాదు చేశారు. 4) నేను అనారోగ్యముతో, వృద్ధాప్యంలో ఉన్నాము. కుమారుడు రవి నన్ను సరిగా చూసుకోకుండా , మానసికంగా , శారీరకంగా వేధిస్తున్నాడని న్యాయం చేయాలని గూడూరు మండలం , చనుగొండ్ల గ్రామానికి చెందిన విజయకుమార్ ఫిర్యాదు చేశారు. 5) నా పై చెడు ప్రయోగాలు చేసి ఆరోగ్యం బాగా లేకుండా చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని కోడుమూరు మండలం, పాలకుర్తి గ్రామానికి చెందిన మహమ్మద్ షఫీ ఉల్లా ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూల్ డిఎస్పి బాబు ప్రసాద్ సిఐలు శివశంకర్, రమేష్, విజయలక్ష్మి లు పాల్గొన్నారు.



## మాల మహానాడు యూత్ విభాగానికి నూతన మండల అధ్యక్షునిగా బండి రాహుల్ నియామకం



**కాశినాయన ఫిబ్రవరి 2 (నంది పత్రిక):**మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముతోటి పౌలు ఆదేశాల మేరకు వైయస్సార్ కడప జిల్లా శ్రీ కాశినాయన మండలానికి యూత్ మాల మహానాడు అధ్యక్షునిగా ఓబులాపురం గ్రామానికి చెందిన బండి రాహుల్‌ను నియమించినట్లు జిల్లా నాయకులు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, యువతలో మంచి గుర్తింపు పొందిన బండి రాహుల్‌కు ఈ బాధ్యత అప్పగించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండి రాహుల్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముతోటి పౌలు కి కృతజ్ఞతలు తెలిపారు. మాల మహానాడు బలోపేతానికి, యువతను సంఘటితం చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలిపారు.

# అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన క్రీడ రెజ్లింగ్.





**రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.**
**విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం సాధించాలి.**

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 2 ( నంది పత్రిక ) అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన క్రీడ రెజ్లింగ్,రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిస్తె స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని నంద్యాల జిల్లా స్థాయి రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యదేవర సుధాకర్ పేర్కొన్నారు. నంద్యాల క్రాంతి నగర్ శ్రీ శాంతినికేతన్ సి. బి. ఎస్. ఈ. విద్యా సంస్థలకు చెందిన క్రీడా మైదానం లో జిల్లాస్థాయి ఖ-15,ఖ-17,ఖ-20 రెజ్లింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నంద్యాల జిల్లాస్థాయి రెజ్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సూర్యదేవర సుధాకర్ , జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ రాబర్ట్ పాల్గొన్నారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సూర్యదేవర సుధాకర్ మాట్లాడుతూ రెజ్లింగ్ పోటీలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినవని, వీటిలో నైపుణ్యం కనబరిచి విజేతలైన విద్యార్థులకు స్పోర్ట్స్ కోటానందు అటు విద్యలోనూ ,ఇటు ఉద్యోగ రంగంలోనూ భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. కాబట్టి ఈ పోటీలలో పాల్గొనేటువంటి విద్యార్థులు చక్కగా రాణించి అటు నంద్యాల జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కు , నంద్యాల ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో విజేతలు అయిన విద్యార్థులు ఈనెల 6,7,8 తేదీలలో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు.

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు





నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 2 ( నంది పత్రిక ) నంద్యాలలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ను నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు అభిరుచి మధు శాలువా పూలదండ వేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాకు సంబంధించిన పలు కీలక రాజకీయ అంశాలు మరియు తాజా పరిణామాలపై వారు చర్చించుకున్నారు. మిత్రపక్షాల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా ఈ సమావేశంలో ప్రస్తావించారు ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## శాంతి భద్రతల కు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని వినతి

మంత్రాలయం న్యూస్: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు,



ఆవు కొవ్వు, చేప నూనె కల్తీ జరిగిందని చేసిన ఆధారరహితపోస్టర్లను డిజైన్ చేసిన, ముద్రించిన, నిధులు సమకూర్చిన మరియు ఏర్పాటు చేసిన వ్యక్తులు, తెలుగుదేశం పార్టీ నాయకులను గుర్తించి, వారి పై చట్టప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేయాలని వైఎస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి సోమవారం మంత్రాలయం సీఐ రామంజులు ను కోరారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మాట్లాడుతూ సంబంధిత తప్పుడు మరియు అపవాదులు కలిగిన పోస్టర్లను తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకొని, ప్రజల్లో శాంతి భద్రతలు భంగం కలిగించకుండ ముందస్తు నివారణ చర్యలు చేపట్టి, భవిష్యత్తులో అవమానకరమైన మరియు బాధ్యతా రహితమైన ప్రజా ప్రకటనల వల్ల ప్రజల్లో అశాంతి, భక్తుల మధ్య విభజన మరియు ప్రజా శాంతి భంగం కలిగిన మరియు సామాజిక సామరస్యం హితార్థం తగిన చర్యలు తీసుకుంటారని కోరారు. అనంతరం పలు డిమాండ్ లతో కూడిన వినతిపత్రాన్ని లీగల్ ప్రతినిధి గురురాజ రావు తో కలిసి సీఐ రామంజులు కి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండలాధ్యక్షులు జి. భీమారెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, నాయకులు బూదూరు లక్ష్మి నారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ స్వామి, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్ శెట్టి, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి వీడి -తెలుగుదేశం పార్టీలో భారీగా చేరిక

### కనకయ్య కొట్టాల వైసిపి వీడి సుధాకర్ నాయకత్వంలో 150 మంది చేరిక



జూపాడుబంగ్లా : ఫిబ్రవరి: 3: (నంది పత్రిక) జూపాడుబంగ్లా మండలం తూడిచెర్ల గ్రామానికి చెందిన వైసీపీ పార్టీ కార్యకర్తలు, నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో గ్రామ సర్పంచ్ బాలమద్దిలేటి, టిడిపి నాయకుడునల్లబోతుల రాముడుల ఆధ్వర్యంలో దొడ్డ సుధాకర్ మరియు దాదాపు 150పైగా కుటుంబాలు వైసీపీని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం అల్లూరు గ్రామంలోని మండ్రా స్వగృహంలో నంద్యాల పార్లమెంటు ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి టిడిపి కండువాలు వేసి పార్టీకి పార్టీలోకి ఆహ్వానించాడు. ఈ కార్యక్రమం లో ఎన్.వెంకట నాయుడు, మాజీ సొసైటీ చైర్మన్ నరసింహుడు, వార్డు మెంబర్ వెంకటయ్య, చిన్న వెంకటస్వామి, కామనూరు మధు, నాగేశ్వరరావు, శివ ఆచారి, హరినాథ్ రెడ్డి, సూరి, పాలమర్రి నారాయణ, ఎల్లాల హనుమంతు, పల్లె కృష్ణ,బోయ శివన్న,బోయ ధర్మానాయుడు, కార్పెంటర్ హుస్సేన్ సాబ్, కల్లం రాజు, శాంత రాజు, ఎం. వెంకటేశ్వర్లు, బోరెల్లి మహేష్, రవికుమార్, శివ నారాయణ, కే. వెంకటేశ్వర్లు, కే.చిన్న వెంకటేశ్వర్లు, గోగుల నాగశివుడు, చిమ్మే సురేష్,ఆంజనేయులు, పెరిమి శేఖర్, అంబారావు శ్రీనివాసులు గౌడ్, బోకూరు, పాపారాయుడు, బోయ నాగన్న, బోయ చంద్రబాబు, సత్యనారాయణ, దొంతుల రాజులు, పుల్లయ్య, బండి హరికృష్ణ, మురహరి ప్రసాద్, రమణయ్య, భాస్కర్, బాలస్వామి,పోతుల శేషి రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్ , రాజమురి నాగేశ్వరరావు, భజన రాజశేఖర్, తదితరులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గుండ్రెడ్డిమోహన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ గిరిశ్వర్ రెడ్డి, పోతులపాడు మాజీ సర్పంచ్ రవికాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, సొసైటీ చైర్మన్ పీక్కిలి శ్రీనివాసులు, యూనిట్ ఇంచార్జ్ రమణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ శెట్టి పాల్గొనడం.



## ఉపాధి కూలీలను మోసం చేస్తున్న కమ్యూనిస్టు పార్టీలు







బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 2: ఉపాధి కూలీలను మోసం చేస్తూ కమ్యూనిస్టు పార్టీలు మభ్య పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ బిజెపి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి పేర్కొన్నారు సోమవారం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పార్నపల్లి గ్రామంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో ఉపాధి కూలీలతో ఒక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా మోర్చా అధ్యక్షుడు బిజ్జం వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మోర్చా అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వీజీ రాంజీ గా మార్చడం జరిగిందని పేర్కొన్నారు. దీనిని సాకుగా తీసుకొని వామపక్షాలు,కాంగ్రెస్ పార్టీ, ఉపాధి పథకం తీసి వేస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు ప్రజలు ఉపాధి కూలీల నుండి వంద రూపాయలు వసూలు చేస్తున్న వామపక్ష కమ్యూనిస్టు భావాలున్న పార్టీలు ఉపాధి కూలీలను మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పేరును మార్పు చేసిందని వంద రోజుల పని దినాలను 125 రోజులకు పెంచిన సంగతి వామపక్ష పార్టీ నాయకులకు తెలియడం లేదా అంటూ ప్రశ్నించారు. రైతులకు ఉపాధి కూలీలకు వి జి రాంజీ పథకాన్ని అనుసంధానం చేశారని గుర్తు చేశారు. గత కాలంలో నెలల తరబడి శ్రామికుల సొమ్ము ఖాతాలలో జమ అయ్యేది కాదని ప్రస్తుతం 15 రోజుల లోపల భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కూలీల డబ్బులు జమ చేస్తూ ఉందని గుర్తు చేశారు. వామపక్ష పార్టీలు నాయకుల అసత్య ప్రచారాలను అందరూ గమనించాలని పేర్కొన్నారు. స్వర్గీయ ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకొని కేంద్రంలో మోడీ దేశాన్ని సంక్షేమ పాలన వైపు పరుగులు తీస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వలసలను నివారించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు.బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి మోడీ నాయకత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు కూడా మాట్లాడారు. సమావేశంలో బిజెపి నాయకులు నాగేశ్వర్ రెడ్డి సాయి దత్తు నాగరాజు చరణ్ తిమ్మారెడ్డి శరత్ తో పాటు ఉపాధి కార్మికులు పాల్గొన్నారు




# అర్జీల పట్ల జిఆర్ఏలు బాధ్యతాయుతంగా స్పందించాలి..!



## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

వై ఎస్ ఆర్ కడప, చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 2 నంది పత్రిక : అర్జీదారులు, ఫిర్యాదుదారుల సమస్యలపై జిఆర్ఏ (గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ) అధికారులుబాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబందిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం లో భాగంగా ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు కూడా అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు.. ఈ సందర్భంగా హాజరైన అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా అర్జీదారులకు సంతృప్తి కరమైన, నాణ్యమైన వేగవంతమైన పరిష్కారాన్ని అందిస్తోందన్నారు.ప్రభుత్వ ఆశయానికి కట్టుబడి ప్రతి శాఖ జిల్లా అధికారితో పాటు ఆయా శాఖల మండల స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో.. గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ అధికారులు పొంతనలేని సమాధానాలు అర్జీదారులకు అందివ్వకూడదని, అర్జీదారుడు అందించే ఫిర్యాదుకు.. సరైన, సూటి సమాధానం ఇవ్వాలన్నారు. పైస్థాయి అధికారులు, పిజిఆర్ఎస్ సిబ్బంది, ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉండాలని, ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేసుకోవాలన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో శాఖ అధికారులు ప్రధాన భూమిక పోషించాలన్నారు. అన్ని కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ విధానం అమలు జరగాలి:జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఈ-ఆఫీస్ సిస్టమ్ ఆచరణలో ఉండగా.. అన్ని శాఖల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఇక మీదట అన్ని కార్యాలయాల్లో తప్పనిసరిగా ఈ ప్రక్రియ అమలు చేయాలన్నారు. ఇంకనూ ఆచరణలో లేని శాఖలు అందుకు సంబంధించిన కనీస మౌలిక సదుపాయాలను వెంటనే సమకూర్చుకోవాలన్నారు. అన్ని శాఖలు తప్పనిసరి గా డాక్యుమెంట్ అప్ లోడ్ చేయాలిలి అన్ని ప్రభుత్వకార్యాల యాల్లో అన్ని శాఖలు జిల్లా స్థాయి కార్యాలయం నుండి మండల, గ్రామ స్థాయి కార్యాలయాల వరకు.. అఫీషియల్ కరస్పాండెన్స్, ఉత్తర ప్రత్యుత్తరాలు, జీవోలు, మెమోలు, అన్ని రకాల కార్యకలాపాలకు సంబంధించి ప్రతి డాక్యుమెంట్ ను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలను పారదర్శకంగా అన్ని శాఖల సమాచారాన్ని కింది నుండి పైస్థాయి అధికారులకు ఆన్ లైన్ లోనే తెలుసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన నూతన ఎల్ఎల్ఎం టూల్ ను ఆవిష్కరించి నిర్వహణలోకి తీసుకురానుందన్నారు. అందుకుగాను జిల్లా స్థాయిలో ప్రతి శాఖ వారి పరిధిలోని డివిజన్, మండల, గ్రామ స్థాయిలో అన్ని కార్యకలాపాలకు సంబంధించిన డేటాను స్కాన్డ్ డాక్యుమెంట్ రూపంలో భద్రపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ఐసి ఆధ్వర్యంలో నిర్వహణలోకి రానున్న ఈ విధానం ద్వారా.. ఆన్ లైన్ లో కార్యాలయ కరస్పాండింగ్ విధానం మరింత పటిష్టంగా, పారదర్శకంగాసాగనుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు.. ప్రొద్దుటూరు మండలం జోకే వీధి కి కు చెందిన షేక్ గౌసియా నాకు ఒంటరి మహిళా పింఛన్ మంజూరు. చేవలసిందిగా కోరుతూ సోమవారం అర్జీని సమర్పించారు. చెన్నూరు మండలం లక్ష్మి నగర్ కు చెందిన ఉల్లిపాయల లక్ష్మి దేవి వికలాంగుల పింఛన్ మంజూరు చేయవలసిందిగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు. పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామానికి చెందిన మాచుపల్లె వెంకటరమణ తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయుదురని కోరుతూ సోమవారం అర్జీని సమర్పించారుదువ్వూరు మండలం బయనపల్లె గ్రామానికి చెందిన గడ్డ రామకృష్ణ తనకు వికలాంగులశాఖ వారి నుండి బ్యాటరీ సైకిల్ ఇప్పించగలరని సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు. 5)సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు గ్రామానికి చెందిన కొమ్ము నల్లమ్మ మా తాతకు ఇద్దరు భార్యలు అందులో మా అమ్మ గజ్జల కుళ్లాయమ్మ నా పేరున ఇండ్లు రాయిచ్చినది కాని కొందరు ఆ స్థలాన్ని కబ్జా చేసారని సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ ఓబుళమ్మ, డి.ఆర్.డి.ఏ. పి.డి. జి.రాజ్యలక్ష్మి కో-ఆఫ్ రేటివ్ శాఖ అధికారి వెంకటసుబ్బయ్య, జిల్లా సర్వే మరియు భూమి రికార్డులు అధికారి శాంతరాజు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..



# మహాశివరాత్రి పర్వదిన వేడుకలను విజయవంతం చేయాలి










### ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్‌కు శ్రీకారం

### భక్తులకు సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన దర్శనం కల్పించాలి

### అధికారులను ఆదేశించిన మంత్రుల బృందం

**శ్రీశైలం/నంద్యాల, ఫిబ్రవరి 02(నంది పత్రిక):–** శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా, భక్తి పారవశ్యంతో సజావుగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీశైలంలోని సదాశివయ్య భవన్‌లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రోడ్లు & భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎక్స్–ఆఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కలిసి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, శ్రీశైలం, ఆత్మకూరు డీఎఫ్‌వోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. మహాశివరాత్రి పర్వదిన వేడుకల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వహణ, దర్శన ఏర్పాట్లు, వసతి, భద్రత, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత సంవత్సరం ఎదురైన లోపాలను సవరించడంతో పాటు, సంభవించే సమస్యలను ముందుగానే అంచనా వేసి పరిష్కార మార్గాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఎస్‌ఓపీని ఆధారంగా చేసుకొని అన్ని ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్‌కు శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వం అన్ని ఆలయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. భక్తులకు సజావుగా, సంతృప్తికరంగా దైవ దర్శనం కల్పించినప్పుడే ప్రభుత్వ చర్యలు విజయవంతమైనట్లవుతాయని స్పష్టం చేశారు. వీఐపీ, వీవీఐపీ దర్శనాలకు ప్రత్యేక స్లాట్లు కేటాయించి, నిర్ణయించిన సమయంలోనే దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అటవీ సంరక్షణ పరిధిలో ఉన్న ఆలయ ప్రాంతంలో విస్తరణ సాధ్యం కాకపోయినా, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అడవి మార్గంలో 48 కిలోమీటర్ల నడక దారిలో వచ్చే శివ భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అటవీ శాఖ అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి సమస్యలను అధిగమించాలని మంత్రి ఆదేశించారు. గత ఏడాది తరహాలోనే ఈ సంవత్సరం కూడా భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 14, 15 తేదీలలో రెండు రోజుల పాటు టోల్ గేట్ల వద్ద వాహనాలకు ఉచిత అనుమతి ఇవ్వాలని సూచించారు. రాత్రి వేళల్లో ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించాలని ఆదేశించారు. సాక్షి గణపతి వద్ద రహదారి విస్తరణకు అవసరమైన స్థలాన్ని అటవీ శాఖ అందించినందున, సంబంధిత అధికారులు తక్షణమే రహదారి పనులు చేపట్టాలని సూచించారు. శ్రీశైలానికి వచ్చి వెళ్లే ప్రతి భక్తుడు సంతృప్తికరంగా దర్శనం చేసుకున్నామన్న భావనతో తిరిగి వెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి భారీగా తరలివచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించే వారికి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించి, తగిన స్థలాలను కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఉత్సవాల సమయంలో సున్నా ఘటనలు జరిగేలా అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు మంత్రి ఆదేశించారు. రోడ్లు & భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఆత్మకూరు నుంచి దోర్నాల వరకు ఉన్న ప్రధాన రహదారుల మరమ్మతులు, విస్తరణ, గుంతల పూడిక, రహదారి భద్రతా చర్యలతో కూడిన పనులను ఈ నెల 8వ తేదీలోగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఉత్సవాల సమయంలో వాహనాల రద్దీ అధికంగా ఉండే నేపథ్యంలో రహదారులు సక్రమంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు. భక్తుల సౌకర్యమే లక్ష్యంగా అధికారులు సమిష్టిగా పనిచేసి, ఏ చిన్న లోపం కూడా తలెత్తకుండా సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా, ఘనంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి శాఖ బాధ్యతతో పని చేయాలని మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి అన్నారు. ఎక్స్–ఆఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ లు మాట్లాడుతూ ఈ సారి గతం కంటే 30 శాతం అధిక మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఫిబ్రవరి 8 నుంచి మార్చి 18 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఖచ్చితమైన ప్రణాళికలతో విధులు నిర్వహించేలా గత సమావేశంలో అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. దేవస్థానం సిబ్బంది, పోలీస్, జిల్లా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, శ్రీశైలంలో భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాధికారులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి దరఖాస్తును పరిష్కరిస్తాం

### - తహసీల్దార్ ఉమారాణి

**కొత్తపల్లి – నంది పత్రిక :** అధికారుల దృష్టికి వచ్చిన ప్రతి ధరఖాస్తును పరిష్కరిస్తామని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. స్థానిక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేధిక కార్యక్రమాన్ని సోమవారం వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఎటువంటి సమస్య ఉన్నా అధికారులకు తెలియజేయాలన్నారు. అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే ధరఖాస్తులన్నింటికి పరిష్కారం చూపిస్తామన్నారు. అందులో భాగంగా పీజీఆర్ఎస్నందు రెండు ఇళ్లస్థలాలకోసం, 3 భూమి సర్వేకోసం ధరఖాస్తులు వచ్చాయని ఆమె తెలిపారు.

## 5న సామాజిక తనిఖీ ప్రజావేధిక

### ఏపీఓ విమలమ్మ

**కొత్తపల్లి – నంది పత్రిక :** స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈనెల 5 వ తేదిన సామాజిక తనిఖీ ప్రజావేధిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ విమలమ్మ సోమవారం తెలిపారు. మండలలోని గ్రామాలలో 2024–2025‘ మార్చినెల వరకు జరిగిన పనులపై 2025 డిసెంబర్ 12 నుంచి 02 2026 తేది వరకు గ్రామాలలో సామాజిక తనిఖీ వారు ఫీల్డ్ విజిట్ చేశారన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, హౌసింగ్, ఫారెస్ట్, పంచాయతీ రాజ్ రహదారులు, పశుసంవర్ధక శాఖ, ఎస్ఎస్ఎ, ఆర్డబ్ల్యూఎస్, ఐటీడీఏ పథకములో జరిగిన పనులపై 18 వ సామాజిక తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు.

## ఫిబ్రవరి 12 న జరుగు దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి.

### సీఐటీయూ పట్టణ సహాయ కార్య దర్శి జి.వేణుగోపాల్,



ఫిబ్రవరి 12 వ తేదీనాడు జరుగు దేశవ్యాప్త జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు సహయ కార్య దర్శి జి.వేణుగోపాల్ ఉపాధ్యక్షులు బి. రామాంజనేయులు నగర పంచాయతి కార్మికులను కోరారు. బేతంచర్ల నగర పంచాయతీ కార్మికుల సమావేశం పంచాయతీ కార్యాలయం ఆవరణలో,నాయకులు బి. రామాంజనేయులు, ఎస్. ఖాజా భాష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులు ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం, కేవలం నాలుగు లేబర్ కోడ్లుగా అమలు చేయడం, కార్మిక స్వేచ్ఛను పూర్తిగా పెట్టుబడిదారులకు, భూస్వాములకు, తాకట్టు పెట్టినట్టే అని తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ నెలలో పార్లమెంట్ లో జరిగే సమావేశాలలో, ఈ చట్టం అమలు అయితే, కార్మికులు కట్టు బానిసలుగా ఉండే పరిస్థితి ఉంటుందని అన్నారు. అంతే గాకుండా కార్మికులు పోరాడి సాగించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దుచేసి, 12 గంటల పని విధానాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేయడం సిగ్గుచేటని వారు విమర్శించారు. ఎన్నికలకు ముందు స్కీం వర్కర్లకు అందరికీ తగు న్యాయం చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంత నిర్లక్ష్యంగా దారుణమైన జీవోలను అమలు చేయడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. అందుకే కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేకతపై ఈనెల 12వ తేదీన జరుగుతున్న కార్మికుల జాతీయ సమ్మెను జయప్రదం చేయుటకు సమైక్యంగా కదలి రావాలని వారు కోరారు. అనంతరం నగర పంచాయతీ మేనేజర్ సువర్ణ లక్ష్మికి,సమ్మె నోటీస్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామకృష్ణ,డి. రాజు, నాగ ముని, శేఖర్,వెంకటలక్ష్మి, మహేశ్వరి,మద్దమ్మ, మరియమ్మ, సులోచన, శివమ్మ, కమలమ్మ , చెన్నమ్మ, ఇందిరమ్మ, లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు మాస్, నాగరాజు, విష్ణు ,రమణ, సువర్ణమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## చిత్తడి నేలలను కాపాడుకుందాం....

### రేంజ్ ఆఫీసర్ ఉదయదీప్.



**రుద్రవరం ప్రతినిధి ఫిబ్రవరి 2 (నంది పత్రిక):** చిత్తడి నేలలను కాపాడుకోవడం ద్వారా వాతావరణ సమతుల్యత ఉంటుందని చలమా రేంజ్ ఆఫీసర్ ఉదయ దీప్ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లా వత్తుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజ్ ఆఫీసర్ ఉదయదీప్ మాట్లాడుతూ చిత్తడి నేలలు వాతావరణ సమతుల్యతను కాపాడడంలో , పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్ర వాటిని మరియు చిత్తడి నేలలు రక్షించుకోవడం గురించి విద్యార్థులకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ బాలకృష్ణ, పెద్దకంబలూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కిషోర్, బీట్ ఆఫీసర్ రామారావు, గ్రామ సర్పంచ్ చంద్రమోహన్, ఉపాధ్యాయులు స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు..

## ప్రభాస్ కళాశాలలో ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం






**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 2:** ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్, కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ తోపాటు నంద్యాల బండి ఆత్మకూరు రేంజ్ అధికారి నాసిర్ ఝా ఆదేశాల మేరకు బండి ఆత్మకూరు మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న ప్రభాత్ కళాశాలలో వెట్ ల్యాండ్ దినోత్సవ కార్యక్రమం పై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాఘవ పార్థసారథి, వైస్ ప్రిన్సిపల్ జగదీష్ అధ్యాపకు బృందం విద్యార్థిని విద్యార్థులు బండి ఆత్మకూరువ రేంజ్ అటవీ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్ఆర్ కుంట ఏబీవో రాజేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు చిత్తడి నేలలు గురించి అవగాహన కల్పించారు.చిత్తడి నేలలు పర్యావరణ పరిరక్షణలో జీవవైవిద్యంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఇవి నీటిని శుద్ధి చేయడం వరదలను నివారించడం భూగర్భ జలాలను పెంచడం అరుదైన పక్షి చేపల జాతులకు ఆవాసంగా నిలవడం ద్వారా మానవ మనుగడకు ప్రకృతి సమతుల్యతకు తోడ్పడుతాయని వివరించారు. చిత్తడి నేలలు భూమి యొక్క కిడ్నీలు అని పిలువబడే సహజ సిద్ధమైన వడపోత యంత్రాలని పేర్కొన్నారు చిత్తడి నేలల ముఖ్యమైన ప్రాముఖ్యతలు పర్యావరణ పరిరక్షణ చిత్తడి నేలలు తుఫానులు తాకిడి నుండి తీర ప్రాంతాలను రక్షించే సహజ అడ్డుకట్టలుగా పనిచేస్తాయి. జీవవైవిద్యం వల్ల అరుదైన మొక్కలు చేపలు సరి రూపాలు మరియు పక్షులకు ఆవాసాన్ని కల్పిస్తాయి. నీటి శుద్ధీకరణ వల్ల మలినాలను విషపూరిత పదార్థాలను వడపోసి భూగర్భ జలాలను పునరుద్ధరిస్తాయి. అధిక వర్షపాతం సమయంలో చిత్తడి నేలలు నీటి వినిపించుకొని వరద ఉధృతిని తగ్గిస్తాయి. చేపల వేట వరిసాగు మరియు అనేక రకాల ఉపయోగకరమైన వృక్ష సంపదకు ఇవి నిలయం. కార్బన్డయాక్సైడ్ గ్రహించి నిల్వ ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఆంధ్రప్రదేశ్లో 23,450 కి పైగా చిత్తడి నేలలు ఉండగా వాటిని సంరక్షించడానికి చర్యలు చేపట్టింది.ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం జరుపుకున్నామని కొన్నారు పేర్కొన్నారు . ఈ సందర్భంగా విద్యార్థులకు అడవి సంరక్షణ వన్యప్రాణుల సంరక్షణ పట్ల తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని భూగర్భ జలాలను తరిగిపోకుండా చూసే చిత్తడి నేలలను అభివృద్ధిపరిచే బాటలో భావితరాలు పయనించాలని ప్రతిజ్ఞ చేయించారు.

ఇది మనందరి బాధ్యత అని కరపత్రాల ద్వారా విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు

## ఓవైపు కష్టాల్లో ప్రజలు... బంగ్లాదేశ్ మంత్రులకు రూఫ్‌టాప్ స్విమ్మింగ్ పూల్స్ తో లగ్జరీ ఫ్లాట్లు

బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం తీసుకున్న ఓ నిర్ణయం తీవ్ర వివాదాస్పదంగా మారింది. దేశం ద్రవ్యోల్బణం, గృహ కొరత, నీటి ఎద్దడి వంటి తీవ్ర సమస్యలతో సతమతమవుతున్న వేళ... మంత్రుల కోసం దాదాపు రూ. 806 కోట్ల ప్రజాధనంతో విలాసవంతమైన ఫ్లాట్లను నిర్మించాలని ఆమోదించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం వెలువడిన ఒక నివేదిక ప్రకారం, ఢాకాలోని మింటో రోడ్డులో మూడు కొత్త భవనాల్లో 71 లగ్జరీ ఫ్లాట్లను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 786 కోట్ల బంగ్లాదేశ్ టాకాలు కాగా, ఫర్నిచర్, ఇతర వస్తువుల కోసం మరో 20 కోట్ల టాకాలు కేటాయించారు.

## గ్రూప్ 2 ఉద్యోగం సాధించిన పాఠశాల పూర్వపు విద్యార్థినికి ఘన సన్మానం.

**రుద్రవరం ప్రతినిధి ఫిబ్రవరి 2 (నంది పత్రిక):** గ్రూప్ 2 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఏ ఎస్ ఓ గా ఉద్యోగం సాధించిన పూర్వపు విద్యార్థి విజయలక్ష్మి కి ఘన సన్మానం జరిగింది. సోమవారం మండలంలోని ఎల్లా వత్తుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హెడ్మాస్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ పూర్వపు విద్యార్థి విజయలక్ష్మి ఎల్లా వత్తుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదివి గ్రూప్ 2 పరీక్ష ఫలితాలలో ఉత్తీర్ణత సాధించి ఫారెస్ట్ (ఏఎస్ఓ) అసిస్టెంట్ సెక్షన్ అధికారిగా అర్హత సాధించి నందుకు సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక ఉపసంచాలకులు డాక్టర్ మనోరంజన్ ప్రతాప్, రేంజ్ ఆఫీసర్ ఉదయదీప్, సెక్షన్ ఆఫీసర్ కిషోర్, సర్పంచ్ చంద్రమోహన్, బీట్ ఆఫీసర్ రామారావు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలను మెరుగైన రీతిలో పరిష్కరించాలి





## పిజిఆర్ఎస్ కు 114 దరఖాస్తులు

## జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి, 02(నంది పత్రిక):-** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంతృప్తి స్థాయిలో వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శేషన్న, జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ మాట్లాడుతూ....ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి స్వీకరించిన విజ్ఞప్తులను నాణ్యతతో వేగవంతంగా సంతృప్త స్థాయిలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును జవాబుదారీతనంతో, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీలతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి అర్జీలు క్లియర్ చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా నిర్దిష్ట కాల పరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని సమస్యలు.. బేతంచర్ల మండలం, బేతంచర్ల గ్రామానికి చెందిన పి.లక్ష్మన్న తన రేషన్ కార్డులో తన భార్య, కుమారుని నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓకు దరఖాస్తు సమర్పించారు. నంద్యాల మండలం, మిట్నాల గ్రామానికి చెందిన ఎస్. నాగమహేశ్వర రెడ్డి లేఔట్ రస్తా కోసం ఇచ్చిన స్థలంలో కొందరు ఇల్లు కట్టుకున్నారని, అందుకు తగిన చర్యలు తీసుకొని రస్తా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓకు అర్జీ సమర్పించారు. డోన్ మండలం, జగదుర్తి గ్రామానికి చెందిన పి. అన్నదాత సుఖీభవ నగదు జమ కాలేదని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్ఓకు దరఖాస్తు సమర్పించారు. ఇంకా ఈ కార్యక్రమంలో 114 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా రెవెన్యూ అధికారికి అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 272 అర్జీలు స్వీకరణ

## జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్



**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి, 02(నంది పత్రిక):-** భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేయడం జరిగిందని వాటి ద్వారా 272 అర్జీలు స్వీకరించడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ప్రజల నుండి స్వీకరించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటి ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 272 అర్జీలు స్వీకరించగా, అందులో రెవెన్యూ, గ్రామ, వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి-6, అడంగల్ సవరణలకు సంబంధించినవి-72, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి-35, అసైన్డ్ భూములు, భూఆక్రమణలకు సంబంధించినవి-47, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్కు సంబంధించినవి-28, సర్వే, రీ-సర్వేకు సంబంధించినవి-64, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి-20 దరఖాస్తులు వచ్చాయన్నారు. స్వీకరించిన అన్ని సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో త్వరితగతిన పరిష్కరిస్తామని డిఆర్ఓ తెలిపారు.

## రైతులే పంట నమోదు చేసుకోవచ్చు.. ఏవో



**అవుకు ఫిబ్రవరి 2నందిపత్రిక** ప్రభుత్వం తెచ్చిన ఈ పంట యాప్ ద్వారా రైతులే తమ పంటను శాస్త్రియంగా నమోదు చేసుకోవచ్చని ఏవో కలిమున్నిషా తెలిపారు. సోమవారం ఆమె స్థానిక కార్యాలయంలో పంట నమోదు పై రైతులకు అవగాహనా కల్పించారు.రబి సీజన్లో రైతులు సాగు చేసిన ప్రతి పంట వివరాలను శాస్త్రీయంగా నమోదు చేసేందుకు ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. మండలంలోని ప్రతి సర్వే నెంబర్లో సాగుచేసిన పంటల వివరాలను 'ఈ-పంట' యాప్ ద్వారా నమోదు చేయడం తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి కలిమున్నిసాగారు తెలియజేశారు.అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పిఎం కిసాన్- అన్నదాథ సుఖీభవ, పంటల కొనుగోలు, రుణాలు, యూరియా పంపిణీ వంటి పథకాలకు సమాచారమే ప్రామాణికమని స్పష్టం చేశారు. రైతులకు అందుబాటులో సాంకేతిక సేవలు నమోదు ఇలా చేసుకోవచ్చు రైతులు వారి మొబైల్ ఫోన్లో గూగుల్ ప్లే స్టోర్ నుండి ~~~×మీా 2.0 మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి ఆధార్ నెంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసి ఎంపీఐఎన్ సెట్ చేసుకోవాలి.ఆధార్ నెంబర్ ఆధారంగా వెబ్ లాండ్ తో అనుసంధానమైన రైతుకు చెందిన అన్ని భూకాతాలు యాప్ లో కనిపిస్తాయి.ఇప్పటివరకు రైతు సేవ కేంద్రం సహాయకుడు పంట నమోదు చేయని భూములకు సంబంధించి కూడా రైతులే స్వయంగా నమోదు చేసుకోవచ్చు.పంట నమో సమయంలో 20 మీటర్ల జియో రిఫరెన్స్ హద్దులతో కూడిన పొలంలో ఫోటో తీసుకోవాలి. ఇందుకోసం రైతు తప్పనిసరిగా తన పొలంలోనే ఉండాలి.ఇలా నమోదు చేసిన సమాచారం సంబంధిత రైతు సేవ కేంద్రం సహాయకులకు ధ్రువీకరణకు వెళ్తుంది. పంట నమోదు స్థితిగతులపై ఆ రైతుకు సమాచారం అందిస్తారు. ఈ యాప్ సహకారంతో రైతు సేవా కేంద్రం సహాయకుడు నమోదు చేసిన పంట వివరాలు సరిగా ఉన్నాయో లేదో కూడా పరిశీలించుకోవచ్చు. అవి సరిగా లేకపోతే ఫిర్యాదు చేసే అవకాశం రైతులకు కల్పించారు. అని మండల వ్యవసాయ అధికారి కలిమున్నిసా తెలియజేశారు.అలాగే మండలంలోని రైతులు ఎవరైనా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకో కుండా ఉంటే ఆ రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రం లోని గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులను సంప్రదించాలని తెలియజేశారు

# అవినీతిని ప్రశ్నించిన సీపీఐ నాయకులపై పోలీసుల దాడి అమానుషం




**జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న అక్రమ రేషన్ బియ్యం దందా అక్రమ మద్యం మట్కా పేకాట గంజాయి లను అరికట్టడంలో పోలీసులు విఫలం. రౌడీయిజం, గుండాయిజం, చేసే వారిపై పోలీసుల ప్రతాపం చూపించాలి.**

**సీపీఐ నాయకులను కొట్టిన డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ భాష, ఎస్సై నరేంద్ర, కానిస్టేబుల్ నాగరాజు, సీతారాములను సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.**

**భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)**

**బేతంచెర్ల ఫిబ్రవరి 2 ( నందిపత్రిక).** సీపీఐ నంద్యాల జిల్లా సమితి పిలుపు మేరకు, అవినీతిని ప్రశ్నించిన డోన్ సీపీఐ నాయకులను,అకారణంగా కొట్టిన డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ భాష, ఎస్సై నరేంద్ర, కానిస్టేబుల్ నాగరాజు, సీతారాములను సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ,అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్నా ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శి పి.నాగరాజు అధ్యక్షతన,బేతంచర్ల పట్టణంలోని పాత బస్టాండ్ నందు నిరసన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసే సీపీఐ నాయకుల పట్ల, పోలీసులు వ్యవహరించిన తీరు పోలీస్ వ్యవస్థకే కళంకం తెచ్చే విధంగా ఉందని, డోన్ మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగిందని ప్రశ్నించిన డోన్ సీపీఐ మండల కార్యదర్శి నారాయణను, తిమ్మాపురం గ్రామ శాఖ కార్యదర్శి సురేష్ ను, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వారిని డోన్ పట్టణ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి, కొట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. డోన్ మండలం తిమ్మాపురంలో ఉపాధి హామీ పథకం లో అవినీతి జరిగిందని, అవి నీతిపై సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పనులు జరిగే చోట పరిశీలించి, సంబంధిత అధికారులకు గత వారం ఫిర్యాదు చేశారని, ఉపాధి అధికారులు పనులు జరిగే చోటు పరిశీలించి అవినీతి జరిగిందని తేల్చారు. అవినీతి చేసిన టిడిపి కార్యకర్త శీను, ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లి సురేష్ పై ఫిర్యాదు చేయడంతో,రూరల్ సిఐ, యస్.ఐ ఉన్నప్పటికీ,పట్టణ సిఐ ఇంతియాజ్ భాష, రూరల్ పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న సురేష్, నారాయణ ను పట్టణ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి కొట్టాడన్నారు. డోన్ లో సీపీఐ పార్టీ పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా, ముఠాకక్షలకు వ్యతిరేకంగా, పోరాటాలు నిర్వహించి,పదుల సంఖ్యలో ప్రాణాలర్పించిన చరిత్ర సీపీఐ పార్టీకి ఉందన్నారు. అలాంటి సీపీఐ నాయకులను అకారణంగా కొట్టడం సరికాదన్నారు, అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించి నాయకులను కొట్టడం ఏమిటని ప్రశ్నించారు, నంద్యాల జిల్లా వ్యాప్తంగా అక్రమ రేషన్ బియ్యం దందా, మట్కా, పేకాట, అక్రమ మద్యం విచ్చలవిడిగా దొరుకు తుందని, గంజాయి మారక ద్రవ్యాలు సులువుగా దొరుకుతున్నాయని, రౌడీయిజం, గుండాయిజం, మహిళలపై దాడులు, అత్యాచారాలు, దొంగతనాలు చేసే వారిపై పోలీసులు ప్రతాపం చూపిస్తే బాగుంటుంది కానీ,నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించే, అవినీతి అక్రమాలను ప్రశ్నించే సీపీఐ నాయకుల పై పోలీసులే దాడి చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. వెంటనే జిల్లా ఎస్పీ జరిగిన సంఘటనపై విచారణ జరిపి, సస్పెండ్ చేయాలని కోరారు. లేని యెడల డీజీపీకి ఫిర్యాదుతో పాటు, మానవ హక్కుల కమిషన్కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. డోన్ పట్టణ సిఐ ఆగడాలు మితి మీరి పోయాయన్నారు, అధికార పార్టీ అండదండలు చూసుకుని, అకారణంగా ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్నాడని మండిపడ్డారు. అధికార పార్టీ మీద అంత ప్రేమ ఉంటే,అధికార పార్టీ నాయకుల దగ్గర ఉద్యోగాలు చేసుకోవాలని, ఇలా సీపీఐ నాయకులపై దాడి చేయడం సరైంది కాదన్నారు. అకారణంగా దాడి చేసిన సిఐ, ఎస్సై, కానిస్టేబుల్లపై,పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్, డి.దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శులు ప్రదీప్, మధు, భాస్కర్, ఎల్లకృష్ణ, రైతు సంఘం నాయకులు రామచంద్రుడు, సీపీఐ నాయకులు సోమన్న, నాగేశ్వరరావు, తిమ్మయ్య, బాలు, గోపి, పెంచలయ్య, ధనుంజయ, దేవరాజు, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.




## శ్రీశైలం శివరాత్రి బ్రహ్మోత్సవాల భద్రతా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా పరిశీలన



**నంద్యాల/శ్రీశైలం, ఫిబ్రవరి 02(నంది పత్రిక):-** మహా పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని, దేశం నలుమూలల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, అధికారులను ఆదేశించారు. సోమవారం శ్రీశైలం క్షేత్రంలో ముఖ్యమైన ప్రాంతాలైన పాతాళగంగ, రోప్వే, పార్కింగ్ ప్రదేశాలు, కోనేరు, స్నాన ఘట్టాలు, ఆలయ పరిసర ప్రాంతాలు తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేలా తీసుకోవాల్సిన చర్యలు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాంతిభద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భక్తుల భద్రతే ప్రథమ లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రతి చిన్న అంశంపై కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ మరియు ఎస్పీ పేర్కొన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా, విజయవంతంగా నిర్వహించే దిశగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## జగన్ పాదయాత్రపై టీడీపీలో వణుకు

### వైసిపి రాష్ట్ర కార్యదర్శి కిషోర్ రెడ్డి

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 2, నంది పత్రిక** వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టబోయే పాదయాత్ర పేరు వింటేనే తెలుగుదేశం పార్టీ నాయకులలో వణుకు పుడుతోందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో జగన్ పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని, ఇప్పుడు మరోసారి ఆయన ప్రజల్లోకి వస్తుండటంతో టీడీపీ నేతల్లో గుబులు మొదలైందని, అందుకే కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆటవిక పరిపాలన కొనసాగు తున్నదని, వైసీపీ కార్యకర్తలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదేమని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు జరిగిపో తున్నాయని అన్నారు. అలాగే తిరుమల లడ్డులో నెయ్యికల్తీ విషయంపై సుప్రీం కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో ఈ రోజు మళ్ళీ కొత్తగా ఈ దాడులకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తమ అధినేత జగన్ పాదయాత్రపై విమర్శలు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆళ్లగడ్డలో రైతుల సమస్యల పరిష్కారం గాలికి వదిలేసి స్థానిక నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, ఉయ్యాలవాడలో రైతుల చెక్కుల పంపిణీలో గోల్మాల్ చేయాలని ప్రయత్నించారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచకాలకు రాష్ట్రం లో రాష్ట్రపతి పాలన అమలు చేయాల్సిన పరిస్థితి వచ్చేలా ఉందన్నారు. ఇప్పటికీ ఆయన డైవర్షన్ పాలిటిక్స్ ప్రజా సమస్యల పరిష్కారాణికి కృషి చేయాలని ఆయన తెలిపారు.




## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బిసి రాజారెడ్డికి ఆహ్వానం

### ఫిబ్రవరి 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు యాగంటి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

**బనగానపల్లె ఫిబ్రవరి 2నందిపత్రిక** జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డిని ఆలయ సిబ్బంది సోమవారం ఆహ్వానించారు. ఈమేరకు ఆలయ చైర్మన్ మౌళిశ్వర్ రెడ్డి, ఈవో పాండురంగారెడ్డి లు బిసి రాజారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి బ్రహ్మోత్సవాలు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను బిసి రాజారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఈవో ఈనెల 14వ తేదీ నుండి 18వ తేదీ వరకు యాగంటి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 14వ తేదీ ధ్వజారోహణముతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని, 15వ తేదీ మహాశివరాత్రి, 16వ తేదీ నందికోల ఉత్సవం, 17వ తేదీ శ్రీ స్వామివారి రథోత్సవం, 18వ తేదీ శివదీక్ష విరమణ, పూర్ణాహుతి, నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సవం, ధ్వజ అవరోహణముతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని బిసి రాజారెడ్డి ఆలయ అధికారులకు సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారని వారికి త్వరితగతిన స్వామి వార్ల దర్శనమయ్యేలా చూడాలని తెలిపారు.



## పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్ దుస్తులు పంపిణీ

**బనగానపల్లి ఫిబ్రవరి 2నందిపత్రిక** బనగానపల్లె గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మరియు ఆఫీసు సిబ్బందికి రాష్ట్ర రోడ్డుభవనాల శాఖ మంత్రి సతీమణి బీసి ఇందిరారెడ్డి చేతుల మీదుగా యూనిఫారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఈసారి యల్లమ్మ, గ్రామపంచాయితీ ఈవో సతీష్ కుమార్ రెడ్డి మరియు ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.



# మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైసీపీ నేతల ఇంటిపై దాడులు చేసిన తెలుగు దేశం గూండాలపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి..వైసీపీ నేతలు



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 2 ( నంది పత్రిక ).** మాజీ మంత్రి అంబటి రాంబాబు,వైసిపి నేతల ఇళ్లపై దాడులు చేసిన టీడీపీ గుండాలపై కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ మాబున్నిసా,ఎమ్మెల్సీ ఇషాక్ భాష డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ పై దుష్ప్రచారం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతే తప్పు అని సీబీఐ, సిట్ సాక్షిగా బహిర్గతం కావడం కావడంతో రాష్ట్ర ప్రజలకు అసత్యం చెప్పామన్న విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి మాజీ మంత్రి అంబటి రాంబాబును రెచ్చగొట్టి కర్రలతో, రాళ్లతో, గుడ్డతో ఇంటిపై దాడులు చేసి అలాగే వైసీపీ నేతల ఇళ్లను తగులబెట్టి వారి కార్లను కాల్చివేసి భీతావహ వాతావరణాన్ని తెలుగుదేశం కార్యకర్తలు సృష్టించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దాడులను ఖండిస్తున్నామని నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డా. శశికళారెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, జిల్లా మేధావుల విభాగం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, వైసీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టీ వై శివయ్య, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి అనీల్ అమృతరాజ్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కారురవికుమార్, వైసీపీ జిల్లా కార్యదర్శులు దేవనగర్ బాష, శివనాగిరెడ్డి, నంద్యాల నియోజకవర్గ అధ్యక్షుడు రామచంద్రుడు, నంద్యాల అసెంబ్లీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు మనోజ్ కుమార్, కౌన్సిలర్లు సాదిక్ బాష, కలాం బాష, ఆరిఫ్ నాయక్, నంద్యాల వైసీపీ విభాగం సభ్యురాలు హుసేనమ్మ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ మేరకు వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి నిర్దేశం మేరకు నంద్యాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడిచేసిన తెలుగు దేశం గుండాలపై అలాగే భూమన కరుణాకర్ రెడ్డి ఇంటిపై జోగిరమేష్ ఇంటిపై దాడిచేసి తగులబెట్టిన భీతావహానికి కారకులైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాధు చేయడం జరిగింది. అనంతరం వైసీపీ నేతలు మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో తెలుగు దేశం గూండాల విధ్వంస కాండ కొనసాగుతున్నదని, ఇటీవల గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైసీపీ నేతల ఇళ్ల పై తెలుగుదేశం గూండాలు కర్రలు, రాళ్లతో దాడులు చేసి ధ్వసం చేసిన ఘనటలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన దుష్ప్రచారంపై సీబీఐ, సిట్ ధర్యాప్తు సంస్థలు శ్రీవారి లడ్డూలో ఎటువంటి జంతువుల కొవ్వులు కలపలేదని క్లీన్ చీట్ ఇవ్వడంతో ఎక్కడ తాము చేసిన తప్పిదం ప్రజల్లోకి వెల్లి పోతుందోనని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ దాడులు చేయడం దారుణమైన చర్యలని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి నేతలు రాష్ట్ర ప్రజలకు లడ్డూ వివాధంలో తాము తప్పు చేశామని క్షమాపణ కోరాల్సి ఉండగా మాజీ మంత్రి అంటి రాంబాబును తెలుగుదేశం వారు నోటికి వచ్చిన విధంగా దుర్భాషలాడటం సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు భీతావహాన్ని సృష్టిస్తూ దాడులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసత్యపు ప్రచారంలో భాగంగా గుంటూరులో ప్లెక్సీలు వేసిన తెలుగుదేశం వారు ఆ ప్లెక్సీలను తీయాలని కోరిన మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కర్రలతో, రాళ్లతో దాడికి పాల్పడేందుకు సిద్ధంగా ఉండి అక్కడ నుండి ఇంటిపై దాడికి పాల్పడ్డారని ఇది కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో చేస్తున్న దుష్టపాలన అని విమర్శించారు. దాడులకు పాల్పడిన తెలుగుదేశం గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.





# డ్రోన్ సహాయంతో పేకాట ఆడుతున్న వారిని అదుపు లోకి తీసుకున్న బేతంచెర్ల సి ఐ.



**బేతంచెర్ల ఫిబ్రవరి 2 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలంలోగల గూటు పల్లె గ్రామ పరిసర కొండ లోని గుంపు చెట్ల మధ్య పేకాట ఆడుతున్న 11 మందిని డ్రోన్ సహాయంతో బేతంచెర్ల సిఐ వెంకటేశ్వర రావు అదువు లోకి తీసుకున్నారు. పేకాట రాయుల్ల దగ్గర నుండి 78 వేల రూపాయాలు నగదు మరియు 6 మోటార్ బైకులను స్వాదీనం చేసుకు న్నామని సిఐ. వెంకటేశ్వర రావు తెలియ జేశారు.

# పెట్రోల్ బాంబులతో దాడి అత్యంత దారుణం

**రాష్ట్రంలో పూర్తిగా గాడి తప్పిన శాంతి భద్రతలు :ఎస్వీ మోహన్‌రెడ్డి**

**కర్నూలులో మీడియాతో మాట్లాడిన వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి.**



**కర్నూలు నంది పత్రిక....** రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని, కూటమి నేతలు పెట్రోల్ బాంబులతో ప్రతిపక్ష నేతల ఇళ్లపై దాడులు చేస్తుంటే పోలీసులు ప్రేక్షకుల్లా చూస్తూ నిలిచిపోయారని కర్నూలులో మీడియాతో మాట్లాడిన వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎస్వీ మోహన్‌రెడ్డి ఆక్షేపించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..:మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్ల వద్ద పోలీసుల ముందే రాళ్లు, కర్రలతో, పెట్రోల్ బాంబులతో టీడీపీ గుండాలు దాడులకు తెగబడ్డారు. వారిని అడ్డుకోలేక పోవడం దారుణం. అది పోలీసుల చేతకానితనమా? లేక అధికార పార్టీకి దాసోహం అయ్యారా? కొంతమంది వల్ల పోలీసు వ్యవస్థకే చెడ్డపేరు వస్తోంది. ఇలాగే పరిస్థితులు కొనసాగితే శాంతిభద్రతలకే ప్రమాదం. పోలీసు వ్యవస్థపై నమ్మకం పోతే రాష్ట్రంలో అరాచక పరిస్థితులు తలెత్తుతాయి. ఇలాంటి దౌర్జన్యాలతో వైయస్సార్‌సీపీ భయపడుతుందని అనుకుంటే అది మీ భ్రమే. రేపు మా ప్రభుత్వం వచ్చిన తర్వాత మా పార్టీ వాళ్లు మీ వెంట పడితే మిమ్మల్ని కాపాడేందుకు ఎవ్వరూ ఉండరు. లోకేష్ దేశం విడిచిపోతారు. పవన్‌కళ్యాణ్ సినిమా షూటింగ్స్‌లో బిజీగా ఉంటారు. ఈ రోజు మీరు చేసిన ప్రతి చర్య డిజిటల్ బుక్‌లో రికార్డు అవుతోంది. ఇది గుర్తు పెట్టుకోండి. కనీసం ఇప్పుడైనా కేంద్రం రాష్ట్రంపై దృష్టి పెట్టాలి. ప్రధాని, కేంద్ర హోం శాఖ స్పందించి తక్షణమే రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని ఎస్వీ మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఫిబ్రవరి 7న ఎమ్మిగనూరు కు ముఖ్యమంత్రి రాక

**ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు**

**రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహణ - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**



**కర్నూలు, నంది పత్రిక....**ఫిబ్రవరి 7వ తేదీన ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. సోమవారం కలుగొట్ల గ్రామంలో కలెక్టర్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ , జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , సఎమ్మెల్యే డా. జయ నాగేశ్వర రెడ్డి , ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ , అలాగే సంబంధిత శాఖల అధికారులతో కలిసి సీఎం పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్, ప్రజా వేదిక, రైతులతో ముఖాముఖి కార్యక్రమాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ... ఫిబ్రవరి 7వ తేదీన కలుగొట్ల గ్రామంలో నిర్వహించనున్న పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా వేదిక కార్యక్రమం, రైతుల పొలాల పరిశీలన, తదితర కార్యక్రమాలు జరగనున్నాయని, కార్యక్రమాలన్నీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ , జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఎమ్మిగనూరు శాసనసభ్యులు డాక్టర్ జయ నాగేశ్వర రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ , డిఎంహెచ్వో భాస్కర్ , ఆర్ అండ్ బి ఎస్. ఇ. మహేశ్వర్ రెడ్డి , డి పి ఓ భాస్కర్ , డిఎస్ఓ రాజా రఘువీర్ , ఏ డీ సర్వే మణికన్నన్ , జేడీ అగ్రికల్చర్ వరలక్ష్మి , తహసీల్దార్ శ్రీనివాసులు , మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిత్తడి నేలల పరిరక్షణపై అవగాహన.



**రుద్రవరం ప్రతినిధి ఫిబ్రవరి 2 (నంది పత్రిక):** చిత్తడి నేలల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు రేంజ్ ఆఫీసర్ ముర్తుజావలి తెలిపారు. సోమవారం డిడి పిటి,అనురాగ్ మీనా నంద్యాల వారి ఉత్తర్వుల మేరకు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని లితడి భూములు మరియు సాంప్రదాయ జ్ఞానం: సాంస్కృతిక వారసత్వాన్ని జరుపుకోవడం" అనే ఇతివృత్తంతో అవగాహన కార్యక్రమం జరుపుకున్నారు. సబ్ డి ఎఫ్ శ్రీనివాస్ రెడ్డి జెడ్.పి.హెచ్ స్కూల్ హెడ్ మాస్టర్ వారి సమక్షంలో అహోబిలం జెడ్.పి.హెచ్ స్కూల్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఇందులో భాగముగా రేంజిఆఫీసర్ ముర్తుజావలి మాట్లాడుతూ విద్యార్థులకి రామ్సర్ కన్వెన్షన్ మరియు చిత్తడి నేలల పరిరక్షణ గురించి వాటి ఆవశ్యకత, ప్రాముఖ్యత మరియు చిత్తడి నేలల ప్రభావం గురించి వివరించడం జరిగింది మరియు అటవీ పర్యావరణ వ్యవస్థలో నీటి సేకరణ నిర్మాణాల గురించి కూడా వివరించడం జరిగింది పర్యావరణ వ్యవస్థలో చిత్తడి నేలలు కిడ్నీ లుగా ను, అటవీ ఆవరణ వ్యవస్థ ఊపిరితిత్తులు గాని వ్యవహరించి జీవకోటికి ఎంతో మేలుకలిగిస్తాయని పేర్కొన్నారు. . తరువాత నూతల సెక్షన్ లోని నూతల నార్త్ బీట్ లోని గండ్లేరు రిజర్వాయర్ లో విద్యార్థులకు విద్యా టూర్ నిర్వహించి నల్లమల ప్రాంతంలోని వృక్షజాలం మరియు జంతుజాలం మరియు అటవీ అగ్నిప్రమాదాల నిర్వహణ, వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల నివారణ కార్యకలాపాల గురించి వివరించారు. ఇందులో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి సెక్షన్ ఆఫీసర్లు మక్తర్ బాషా, రామకృష్ణ, రాణమ్మ, బీట్ ఆఫీసర్లు నాగ హుస్సేన్, సురేంద్ర గౌడ్, నరసింహా రెడ్డి, జేమ్స్ పాల్ మరియు రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో ఉద్రిక్తత...

**ఎమ్మెల్యే, ఎ వి లమధ్య ఘర్షణ**





**ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 2, నంది పత్రిక** ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, మాజీ రాష్ట్ర విత్తనాబివృద్ధి సంస్థ చైర్మెన్ ఏ వి సుబ్బారెడ్డి లమధ్య ఘర్షణతో ఆళ్లగడ్డలో ఉద్రిక్తత ఏర్పడింది. సోమవారం ఆళ్లగడ్డ పట్టణం పాతబస్తండ్ సమీపంలోని ఏవీ సుబ్బారెడ్డి కాంప్లెక్స్ కు, కర్ణమయ్య వీధికి మధ్య ఉన్న సీసీ రోడ్డుపైన అడ్డంగా కట్టిన గోడను టౌన్ ప్లానింగ్ అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తొలగించారు. విషయం తెలుసుకున్న ఎ వి సుబ్బారెడ్డి ఆక్కడికి చేరుకోవాలని ప్రయత్నించడంతో ఘర్షణ ఇరువర్గాల మధ్య ఉధృతమవుతుందని పట్టణవాసులు భయాందోళన చెందారు. ఈపాటికే అక్కడికి చేరుకున్న డీఎస్పీ ప్రమోద్, సి ఐ యుగంధర్ లు తమ సిబ్బందితో ఇరువర్గాలు ఎదురు పడకుండా ఎ వి సుబ్బారెడ్డిని పాత బస్టాండ్ వద్దనే ఆపి ఘర్షణ వాతావరణాన్ని సద్దుమనిశారు. ఈ సందర్భంగా ఎ వి సుబ్బారెడ్డి మాట్లాడుతూ సదరు కాంప్లెక్స్ కు సంబంధించి తన వద్ద డాక్యుమెంట్లు ఉన్నాయనీ, తనకు నోటీసులు ఇవ్వకుండా కాంప్లెక్స్ కు సంబంధించి గోడను ఎలా పడగొడతారని ప్రశ్నించారు. ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆమె సోదరుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి అరాచకాలను రాష్ట్ర పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి వివరిస్తానన్నారు. తమ అనుచరులు, కార్యకర్తలు తొందరపడి ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన తెలిపారు.

# శ్రీ వీరభద్ర స్వామి ఆలయ ఎక్స్ ఆఫీసియో మెంబెర్ గా శ్రీ. ప్రసాద్ శర్మ



**శిరివెళ్ల : (నంది పత్రిక)** సిరివెళ్లమండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గల శ్రీ వీరభద్ర స్వామి ఆలయ చైర్మన్ ధర్మకర్తల నియామక ప్రక్రియ పూర్తి అయిన విషయం విధితమే అనంతరం ఆలయ ఎక్స్ అఫీషియో మెంబర్ గా ప్రధాన అర్చకులు శ్రీ ప్రసాద్ శర్మ ను గ్రామ ప్రముఖులు పెద్దలు ప్రజలు ఆలయ అధికారుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆలయ చైర్మన్ వారికి ధర్మకర్తలకు దిశ నిర్దేశం చూపుతూ ఆలయ ఉత్సవాలు విశేష ప్రతిష్ఠ పూజ కార్యక్రమాలు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రసాద్ శర్మ వారు ఎంతగానో దోహదం చేస్తారని ఈ సందర్భంగా గ్రామస్తులు కొనియాడారు. ఎక్స్ అఫీషియో మెంబర్ గా నియామక పత్రం అందుకున్న ప్రసాద్ శర్మ వారిని ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి లక్ష్మీ వీరభద్ర స్వామి ఆలయ చైర్మన్ మారి నాయుడు మరియు గ్రామ ప్రముఖులు ప్రజలు పట్టు శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు.

# బాలికలు అప్రమత్తంగా ఉండాలి అసాంఘిక శక్తుల నుంచి రక్షణపై అవగాహన కార్యక్రమం



**కాశినాయన ఫిబ్రవరి 2 (నంది పత్రిక):** శ్రీ అవధూత కాశినాయన మండలం నరసాపురం గ్రామంలోని ఏ.పీ మోడల్ స్కూల్‌లో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల విద్యాధికారి మహమ్మద్ షఫీ, ప్రిన్సిపాల్ సౌజన్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సీఐ హేమసుందర్, ఎస్సై యోగేంద్ర మాట్లాడుతూ 9వ, 10వ తరగతి మరియు ఇంటర్ చదువుతున్న బాలికలు అసాంఘిక శక్తుల నుంచి తమను తాము కాపాడుకోవాలని సూచించారు. సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని, చెడు సావాసాలను విడిచి పెట్టి చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రత్యేకంగా సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు ఎదురైతే వెంటనే ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి-బిజెపి



**పాములపాడు ఫిబ్రవరి 2 (నంది పత్రిక) -:** పూర్తి అంగవైకల్యం గల వికలాంగులకు రూ. 15వేలు పింఛన్ ఇవ్వాలని బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు మాధవ్ ఆదేశాల మేరకు, జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు సూచనలతో పాములపాడు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో "జనతా వారధి" కార్యక్రమంలో భాగంగా సోమవారం వికలాంగుల సమస్యలపై తహసిల్దార్ కు వినతి పత్రాలు అందజేయడం జరిగిందనీ తెలిపారు. తుమ్మలూరు గ్రామానికి చెందిన వికలాంగులు భాస్కర్ రెడ్డి, చాంద్ బాషా మాట్లాడుతూ మాకు 90 శాతం పూర్తి అంగవైకల్యం ఉందని వికలాంగుల పింఛన్ రూ.6వెల నుంచి 15 వేల వరకు పెంచాలని, అలాగే నిత్యవసర సరుకులు వికలాంగుల ఇంటికి పంపవలసిన రేషన్ డీలర్ మాకు పంపడం లేదని, నూతన ట్రైసైకిల్, గృహం మంజూరు చేయాలని కోరారు. టిటిసి చదివిన చాంద్ భాషా కు స్వయం ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల వైస్ ప్రెసిడెంట్ లింగాల గోపాలకృష్ణయ్య, చిన్న మద్దిలేటి, సంజన, రామకృష్ణ, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 2 నంది పత్రిక** అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పారవేట మహోత్సవ సందర్భంగా 33 గ్రామాలు 32 రోజులపాటు తన పెళ్లికి రావాలంటూ పిలిచే కార్యక్రమంలో భాగంగా, సోమవారం నాడు పట్టణంలోని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నివాసం వద్దకు చేరుకున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి పారు వేట పల్లకి.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భార్గవ్ రామ్ దంపతులు , టిడిపి యువ నాయకుడు భూమ జగత్ విఖ్యాత్ రెడ్డి, లక్ష్మీ నరసింహస్వామి మొక్కుకున్నారు ఆలయ ప్రధానార్చకులు కిడంబి వేణుగోపాలన్ నరసింహ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



# మూడు రోజులు తాగునీటి సరఫరా నిలిపివేత.

**నగర పంచాయితీ కమిషనర్ డి. హరిప్రసాద్.**



**బేతంచెర్ల ఫిబ్రవరి 2 ( నంది పత్రిక ).** గోరుకల్లు రిజర్వాయర్ నుండి బేతంచెర్ల, డోన్, ప్యాపిలి మండలాల ప్రజలకు వాటర్ గ్రిడ్ పథకం ద్వారా వచ్చు తాగు నీరు బేతంచెర్ల పట్టణం నకు మూడు రోజుల పాటు నిలిపి వేయడం జరుగునని బేతంచెర్ల నగర పంచాయితి కమీషనర్ డి. హరిప్రసాద్ తెలిపారు. కనుక ఈ నెల 3 వతేదీ నుండి 5 వ తేది వరకు తాగు నీటి సరఫరా నిలిపి వేయడం జరుగునని ప్రజలు గమనంలో ఉంచుకొని తాగు నీటిని పొదుపుగా వినియోగించు కొనవలయునని పట్టణ వాసులకు ప్రకటన ద్వారా తెలియ జేశారు.

# యూరోపియన్ ఆర్మీ ఏర్పాటు ప్రమాదకరం: ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్

**అమెరికా, యూరోపియన్ యూనియన్ మధ్య విభేదాలు**

**యూరోపియన్ ఆర్మీ అంశంపై చర్చ**

**నాటోలో ఉన్నందున ప్రత్యేక సైన్యం సృష్టించలేరన్న కాజా కల్లాస్**




యూరోపియన్ ఆర్మీ ఏర్పాటు అంశంపై ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్ కాజా కల్లాస్ స్పందించారు. గ్రీన్‌లాండ్ అంశంలో అమెరికా, యూరోపియన్ యూనియన్ మధ్య విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యూరోపియన్ ఆర్మీ అంశంపై చర్చ సాగుతోంది. అయితే, యూరోపియన్ ఆర్మీ ఏర్పాటు చాలా ప్రమాదకరమని ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్ హెచ్చరించారు. యూరోపియన్ ఆర్మీ అవసరమని చెప్పేవారు ప్రాక్టికల్‌గా ఆలోచించి ఉండరని వ్యాఖ్యానించారు. యూరప్ దేశాలు ఇప్పటికే నాటోలో ఉన్న నేపథ్యంలో, ఒక ప్రత్యేక సైన్యాన్ని సృష్టించలేరని అన్నారు. యుద్ధం వంటి సంక్షోభ సమయాల్లో ఎవరు ఎవరికి ఆదేశాలు జారీ చేస్తారనేది ముఖ్యమైన అంశమని అన్నారు. ఒకవేళ నాటో, యూరోపియన్ ఆర్మీ రెండూ ఉంటే అప్పుడు పరిస్థితి గందరగోళంగా మారుతుందని అన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.

# కుటుంబంలో క్యాన్సర్ ఉంటే అప్రమత్తత తప్పనిసరి అవగాహనే ప్రాణరక్షక ఆయుధం

## డా. రాజేష్ కుమార్ రెడ్డి అడపాల

హైదరాబాద్ నంది పత్రిక....భారతీయ కుటుంబాల్లో క్యాన్సర్ అనే మాట ఇంకా మౌనంలోనే వినిపిస్తుంది. ఇది విధి నిర్ణయమని, ఒక్కసారిగా వచ్చిపడే వ్యాధి అనుకుంటూ చాలామంది నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ వైద్య నిపుణుల మాట ప్రకారంకొన్ని కుటుంబాల్లో క్యాన్సర్ తరతరాలుగా వచ్చే అవకాశం ఉంటుంది. దీనిని భయపడాల్సిన అవసరం లేదు, కానీ ముందే తెలుసుకుని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం మాత్రం తప్పనిసరి. మూత్రవ్యవస్థకు సంబంధించిన క్యాన్సర్లుమూత్రపిండాలు, మూత్రాశయం, ప్రోస్టేట్, వృషణాలువాటిలో కుటుంబ వారసత్వం కీలక పాత్ర పోషిస్తుంది. ఇవి ప్రారంభ దశలో ఎలాంటి నొప్పి లేకుండా నిశ్శబ్దంగా పెరుగుతాయి. అందుకే చాలా మంది రోగులు ఆలస్యంగా ఆసుపత్రికి చేరుకుంటారు. అప్పటికే వ్యాధి ముదిరిపోతుంది.

**కుటుంబ చరిత్రే తొలి హెచ్చరిక** కుటుంబంలో ఒకరిద్దరికి క్యాన్సర్ ఉండటం అనేది మిగతావారికి హెచ్చరికగా తీసుకోవాలి. దీని అర్థం అందరికీ క్యాన్సర్ వస్తుందన్నది కాదు. కానీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం అన్న మాట.ప్రత్యేకంగా దీ=జూ మ్యూటేషన్ ఉన్న కుటుంబాల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. లించ్ సిండ్రోమ్ ఉన్నవారిలో మూత్రాశయం, యూరేటర్ క్యాన్సర్లు కనిపిస్తాయి. అలాగే ఎమా సిండ్రోమ్ ఉన్న కుటుంబాల్లో మూత్రపిండ క్యాన్సర్ అవకాశాలు అధికం.

**ఇవి ఉంటే నిర్లక్ష్యం చేయకండి** వైద్యుల ప్రకారం కొన్ని లక్షణాలు కుటుంబ వారసత్వ క్యాన్సర్లకు సంకేతాలుగా పరిగణించాలి. ఒకరి కంటే ఎక్కువ సమీప బంధువులకు



క్యాన్సర్ రావడం చిన్న వయసులోనే క్యాన్సర్ నిర్ధారణ కావడం ఒకే అవయవానికి చెందిన క్యాన్సర్ కుటుంబంలో పలువురికి రావడం ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ క్యాన్సర్లు మూత్రాంగ క్యాన్సర్లతో పాటు కాలన్, బ్రెస్ట్ లేదా ఓవేరియన్ క్యాన్సర్లు కనిపించడం

**ముందే గుర్తిస్తే సులువు**ఈ రకమైన హెచ్చరికలు ఉన్న కుటుంబాల్లో జెనెటిక్ పరీక్షలు ఎంతో ఉపయోగకరం. కుటుంబ చరిత్ర ఆధారంగా ఎవరికెప్పుడు, ఏ పరీక్షలు అవసరమో వైద్యులు నిర్ణయిస్తారు. రక్తపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కాన్లు, రొటీన్ చెకప్‌లతోనే అనేక సందర్భాల్లో క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించవచ్చు.వైద్య అనుభవాలు చెబుతున్న నిజాలు ఒక 50 ఏళ్ల వ్యక్తి బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చాడు. కుటుంబ చరిత్ర పరిశీలించగా అతని ఇద్దరు సోదరీమణులకు బ్రెస్ట్ క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. పరీక్షల్లో కడుపు క్యాన్సర్‌తో పాటు ప్రోస్టేట్ క్యాన్సర్ కూడా బయటపడింది. జెనెటిక్ పరీక్షల్లో దీ=జూ మ్యూటేషన్ నిర్ధారణైంది. వ్యాధి ముదిరిన దశలో ఉండటంతో అతనికి పలు రకాల చికిత్సలు చేయాల్సి వచ్చింది. ఇంకో సందర్భంలో, 54 ఏళ్ల వ్యక్తి మూత్రంలో రక్తం రావడంతో పరీక్షలు చేయించుకోగా మూత్రాశయం, యూరేటర్ క్యాన్సర్లు బయటపడ్డాయి.

అతనికి గతంలోనే కాలన్ క్యాన్సర్ వచ్చింది. కుటుంబంలోనూ పలువురికి ఇదే రకమైన సమస్యలు ఉన్నట్లు తేలింది. ఇది లించ్ సిండ్రోమ్‌కు ఉదాహరణ. మరో కేసులో, ఒక కిశోరుడు తలనొప్పి, అధిక చెమటలు, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలతో వచ్చాడు. పరీక్షల్లో అడ్రినల్ ట్యూమర్‌తో పాటు రెండు మూత్రపిండాల్లో ట్యూమర్లు ఉన్నట్లు తేలింది. ఇది ఎమా సిండ్రోమ్‌కు చెందిన కేసు.ఇంటి నుంచే నివారణ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం (20252027) థీమ్ "యునైటెడ్ బై యూనిక్". ప్రతి రోగి అనుభవం ప్రత్యేకమైనదైనా, క్యాన్సర్‌పై పోరాటం అందరిదీ ఒకటే అన్నదే దీని సారాంశం.ప్రతి కుటుంబం తన ఆరోగ్య చరిత్రను తెలుసుకోవాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు ముఖ్యమైన వైద్య విషయాలు చెప్పాలి. యువత తమ కుటుంబంలో ఉన్న వ్యాధుల వివరాలను వైద్యులకు తెలియజేయడంలో వెనుకాడకూడదు.ముందే గుర్తించిన క్యాన్సర్ చాలా సందర్భాల్లో నయం అవుతుంది. ఆలస్యంగా గుర్తించిన క్యాన్సర్ చికిత్స కష్టతరం. ఈ తేడాను నిర్ణయించేది అవగాహన, సమయానికి వైద్య సలహా మాత్రమే. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటేనివారణ ఇంటి నుంచే ప్రారంభమవుతుంది. కుటుంబంలో క్యాన్సర్ ఉంటేడ అవగాహన మరింత వేగంగా ముందుకు సాగాలి.

# నరసింహ స్వామి పారువేట పల్లకికి పూజలు..







## అనాదిగా వస్తున్న సంప్రదాయం.. గంగుల ఫణి కృష్ణారెడ్డి

ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 2 నంది పత్రిక ఆళ్లగడ్డ పట్టణంలోని పలు వీధులలో అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి పారువేట పల్లకి పర్యటన కొనసాగుతున్నది. సోమవారం స్థానిక ప్రతాప్ టాకీస్, టీబీ రోడ్డు, గోడౌన్ తదితర వీధులలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి పారువేట పల్లకికి భక్తులు టెంకాయలు, కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి కుమారుడు గంగుల ఫణికృష్ణారెడ్డి, వారి అనుచరులు శ్రీ స్వామివారికి పల్లకి ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పూజలు నిర్వహించిన అనంతరం బీజేపీ నేత గంగుల ఫణి కృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అహోబిలంశ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి పారువేట ఉత్సవం అనాదిగా వస్తున్న సంప్రదాయమన్నారు. ఇలాంటి సంప్రదాయం ఏ క్షేత్రంలో లేదని స్వయంగా అహోబిలం నరసింహస్వామి పారువేటకు వచ్చి తన వివాహానికి రమ్మని పిలవడం ఎంతో విశేషమని అన్నారు. స్వామి రాకను ఒక పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కూడా బిజెపి నాయకులు గంగుల పని కృష్ణారెడ్డి స్వయంగా పాల్గొన్నారు.

**బీజేపీ పార్టీ లోనే కొనసాగుతాం..**

తమ తండ్రి మాజీ పార్లమెంటు సభ్యులు గంగుల ప్రతాపరెడ్డి బీజేపీ పార్టీలోనే కొనసాగుతారని ఆయన అడుగుజాడల్లో

తాము కూడా నడిచి అదే పార్టీలో కష్టపడి పని చేస్తామని పదవులు ఉన్నా లేకపోయినా పార్టీకి అంకితభావంతో సేవ చేస్తామని బిజెపి సీనియర్ నాయకుడు గంగుల ఫణి కృష్ణారెడ్డి స్పష్టం చేశారు.

# పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లో అందిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి.







**అర్జీదారుల సమస్యలు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలి.**

**అర్జీదారుల ఫిర్యాదుల పరిష్కారం, వారు సంతృప్తి చెందే విధంగా ఉండాలి.**

**నేడు పిజిఆర్ఎస్ లో 260 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్ లో 66 దరఖాస్తులు స్వీకరణ.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**

భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 2 నంది పత్రిక సోమవారం కలెక్టరేట్ పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో పాటు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీ.డి డాక్టర్ కె. సిహెచ్ అప్పారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ముందుగా పీజి ఆర్ ఎస్ లో అర్జీదారులు అందించే దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియను, రెవిన్యూ క్లినిక్ లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో అర్జీదారుల దరఖాస్తుల నమోదు, పరిష్కార చర్యలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ తో కలిసి స్వయంగా అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెవిన్యూ సమస్యలపై ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినందున ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత గడువు లోపుగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారులు సంతృప్తిచెందేలా సమస్యల పరిష్కారం ఉండాలన్నారు. అధికారులు లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం పీజీ ఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్ లో అందిన అర్జీల పరిష్కారంపై శాఖల వారీగా అధికారులతో సమీక్షించి సత్వరమే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.

**ఈ రోజు అందిన అర్జీలలో కొన్ని పిర్యాదులు ఈ విధంగా ఉన్నాయి.....** మొగల్తూరు మండలం సేరేపాలెం గ్రామానికి చెందిన తణుకుల నాగదుర్గ అర్జీ సమర్పిస్తూ, తన భర్త కరోనా సమయంలో మరణించారని అప్పటినుండి తన అత్తగారు మానసికంగా వేధించడమే కాకుండా ఇంట్లో ఉండడం లేదని, తనకు ముగ్గురు ఆడపిల్లలని, దయచేసి ఆ ఇంటిలో ఉండే విధంగాను, జీవనాధారం కల్పించాలని కోరారు. వీరవాసరం మండలం, కొణితివాడ గ్రామానికి చెందిన సిహెచ్. రాము అర్జీ సమర్పిస్తూ, తనకు 87% వికలాంగత్వంతో సదరం ద్వారా సర్టిఫికెట్ జారీ కాబడిందని, కావున తనకు వికలాంగ పింఛను మంజూరు చేయాలని కోరారు. తాడేపల్లిగూడెం మండలం, కడకట్ల గ్రామానికి చెందిన బందుల సూరమ్మ అర్జీ సమర్థిస్తూ తనకు నలుగురు కొడుకులని, ఆస్తి రాయించుకున్న తదుపరి తనకు ఆశ్రయం, భోజనం పెట్టడం లేదని తనకు న్యాయం చేయాలని కోరారు. తాడేపల్లిగూడెం మండలం, నందమూరి గ్రామానికి చెందిన కట్ట మంగతాయారు అర్జీ సమర్పిస్తూ, గత ప్రభుత్వంలో రీ సర్వే నందు ఫారం 1బి నందు ఇనాం భూములుగా నమోదయిందని మా భూమిని నా పేరున ఆన్లైన్ చేయాలని కోరారు. భీమవరం 6వ వార్డుకు చెందిన ఉయ్యూరు నాగలక్ష్మి తాను అద్దె ఇంట్లో నివసిస్తున్నానని, తనకు టిట్కో గృహ సముదాయంలో ఫ్లాట్ కేటాయించారని, రిజిస్ట్రేషన్ కూడా పూర్తయిందని, ప్రస్తుతం అదే ఫ్లాట్ వేరే వాళ్ల నివసిస్తున్నారన్నారు. ఫ్లాట్ ఖాళీ చేయమంటే ఖాళీ చేయడం లేదని, దయచేసి తమ ఫ్లాట్ తమకు ఇప్పించాలని వినతిపత్రం సమర్పించారు. పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన ఆదుర్తి మల్లికార్జునరావు అర్జీ సమర్పిస్తూ, గ్రామంలో తనకు 24 సెంట్లు భూమి ఉందని, సర్వేయర్లు తనకు రెండు రిపోర్ట్ లు ఇచ్చారని, ఏది వాస్తవమో నిర్ధారణ కాలేదన్నారు. పి జి ఆర్ ఎస్ లో ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. దయచేసి మా భూమికి హద్దులు నిర్ణయించి తమ భూమిని తమకు ఇప్పించాలని కోరారు. ఆకివీడు మండలం, ఆకివీడు గ్రామానికి చెందిన పువ్వాడ విజయ్ కుమారి గతంలో తనకు కళాకారుల పెన్షన్ వచ్చేదని, ప్రస్తుతం నిలిపివేయడం జరిగిందని, తిరిగి కళాకారులకు పింఛను ఇప్పించాలని వినత పత్రం సమర్పించారు. ఈ సమావేశంలో వివిధ శాఖ జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమం ట్రిబునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.




# 8 ఏళ్ళుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోరా..?

## ఆన్లైన్ చేసి న్యాయం చేయాలని కోరుతున్న రైతు



నందికొట్కూరు ఫిబ్రవరి 02 (నందిపత్రిక) మండల పరిధిలోని నాగటూరు గ్రామానికి చెందిన సగినేల వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి తన తండ్రి సగినేల సుబ్బరాయుడు కు బిజినవేముల గ్రామంలో సర్వే నెంబర్ 46 / ఏ లో 0.49 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి దాదాపుగా 46 సంవత్సరాలు గా సుబ్బారాయుడు సాగులో ఉన్నారు. ఈ పొలాన్ని ఆన్లైన్ చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత రెవెన్యూ అధికారులు ఈ భూమి శ్రీశైలం ప్రాజెక్టు లో ఉందని తెలిపారని అన్నారు. అయితే శ్రీశైలం ప్రాజెక్టు లో పొలం పోతే మా కుటుంబానికి 98 జీఓ ద్వారా ఉద్యోగం ఇవ్వాలని సి సి ఎల్ ఏ లో దరఖాస్తు చేసుకున్నామని, వారు మా పొలం ప్రాజెక్టు లో పోలేదని అందుకు సంబంధించిన రికార్డు, అవార్డ్ కపీ ఇచ్చారన్నారు. ఆ కాపీ తీసుకొని మండల రెవెన్యూ అధికారులను మళ్ళీ పొలం ఆన్లైన్ చేయాలని కోరగా ఆర్ ఎస్ ఆర్ లో చుక్కల భూమిగా ఉందని చెప్పారన్నారు. చుక్కల భూమి నుండి మా భూమి తొలగించాలని కలెక్టర్ కు దరఖాస్తు చేసుకున్నానని అయితే కలెక్టర్ మా ఫిర్యాదును స్వీకరించి మా సమస్యను 16 ఏప్రిల్ 2015 న చుక్కల భూమి తొలగించిన్నట్లు ప్రొసీడింగ్స్ ఇచ్చారని అయితే మా పొలం ఆన్లైన్ చేయాలని వెళ్తే అప్పటికే చల్లా వెంకట రెడ్డి పేరుపై ఆన్లైన్ చేసినట్లు మండల రెవెన్యూ అధికారులు పేర్కొన్నారని తెలిపారు. 2024 లో రీ సర్వే లో మా భూమిని చల్లా వెంకట రెడ్డి పేరుపై ఎలా నమోదు చేశారని మండల రెవెన్యూ అధికారిని అడిగితే మాకు తెలియదని సమాధానం చెబుతున్నారన్నారు. 1978లోనే మా భూమి రిజిస్టర్ అయిందని అయితే అధికారులు ఆన్లైన్ చేయకుండా రీ సర్వే లో చల్లా వెంకట రెడ్డి పేరుపై నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నామన్నారు. చుక్కల భూమిగా ఉందని చెబితే కలెక్టర్ దగ్గరకు వెళ్తే చుక్కల భూమి తొలగిస్తున్నామని 16 ఏప్రిల్ 2025 లో ప్రొసీడింగ్స్ తెచ్చామని, అంతే కాకుండా జాయింట్ కలెక్టర్ కూడా 02 జనవరి 2026 లో చుక్కల భూమి తొలగించినట్లు ప్రొసీడింగ్స్ ఇచ్చిన కూడా నాకు ఆన్లైన్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్ని సార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పిర్యాదు చేసిన ఫలితం లేదని మా భూమి అక్రమంగా ఇతరులకు ఆన్లైన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరుతున్నామని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మాకు మా పొలాన్ని ఆన్లైన్ చేసి న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు.

# మహానంది క్షేత్రంలో వైభవంగా స్వామివారి పల్లకి సేవ



మహానంది ఫిబ్రవరి 02 (నంది పత్రిక):- మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారికి వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు.సోమవారం సందర్భంగా ఈవో ఎన్.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు,అర్చకులు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.పూజలు అనంతరం ఆలయ ప్రాకారంలో మేళా తాళాల నడుమ వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు.




# కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో సాంప్రదాయ దినోత్సవం

## బీసీఎన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బీసీ నాగరాజ్



చిత్తూరు జిల్లా బ్యూరో, ( నంది పత్రిక ) ఫిబ్రవరి 2 కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో సాంప్రదాయ దినోత్సవాన్ని సోమవారం బిసిఎన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బీసీ నాగరాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ బి సి నాగరాజ్ మాట్లాడుతూ... సాంప్రదాయ దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాకుండా మన సంస్కృతి సాంప్రదాయ వైవిధ్యాన్ని గుర్తుచేసే ప్రత్యేక సందర్భమని తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలు యువతలో తమ సొంత సంస్కృతి చరిత్ర పట్ల ప్రేమ గౌరవం పెంపొందిస్తుందన్నారు. అనంతరం కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ మాట్లాడుతూ... ఎత్నిక్ డే విద్యార్థులకు వివిధ ప్రాంతాల చారిత్రక, వారసత్వం, నాగరికత, కళలపై అవగాహన కల్పించడంతోపాటు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. విద్యార్థులు చీరకట్టులో సంప్రదాయక వస్త్రధారన తో మెహందీ, వంటల పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎన్.సాగర్ రాజ్, ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దర్శకుడు ఎన్.శంకర్‌ను పరామర్శించిన కేటీఆర్

ప్రముఖ సినీ దర్శకుడు ఎన్.శంకర్ మాతృవియోగంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం శంకర్ ఇంటికి వెళ్లి ఆయన్ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. శంకర్ తల్లి సక్కుబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ... "ప్రముఖ సినీ దర్శకుడు నిమ్మల శంకర్ గారి మాతృమూర్తి నిమ్మల సక్కుబాయమ్మ గారు గత వారం స్వర్గస్తులయ్యారు. ఈ రోజు శంకర్ గారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించాను" అని తెలిపారు. శంకర్ మాతృమూర్తి నిమ్మల సక్కుబాయి గత బుధవారం (జనవరి 28) హైదరాబాద్‌లో కన్నుమూశారు. నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం చిరుమర్తికి చెందిన ఆమె, కొంతకాలంగా వయోభారంతో కూడిన అనారోగ్యంతో బాధపడుతున్నారు.

## నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 2 నంది పత్రిక** అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పారవేట మహోత్సవ సందర్భంగా 33 గ్రామాలు 32 రోజులపాటు తన పెళ్లికి రావాలంటూ పిలిచే కార్యక్రమంలో భాగంగా, సోమవారం నాడు పట్టణంలోని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నివాసం వద్దకు చేరుకున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి పారు వేట పల్లకి.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భార్గవ్ రామ్ దంపతులు , టిడిపి యువ నాయకుడు భూమ జగత్ విఖ్యాత్ రెడ్డి, లక్ష్మీ నరసింహస్వామి మొక్కుకున్నారు ఆలయ ప్రధానార్చకులు కిడంబి వేణుగోపాలన్ నరసింహ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



## ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక అంశాలను బడ్జెట్లో పొందుపరచాలి

### మంత్రి కి వినతి పత్రం ఇచ్చిన యూటీఎఫ్




**బనగానపల్లి ఫిబ్రవరి 2నందిపత్రిక** ఉద్యోగస్తుల ఆర్థిక అంశాలను బడ్జెట్ లో ప్రవేశ పెట్టాలని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు సోమవారం యూటీ ఆధ్వర్యంలో మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా సహాధ్యక్షులు కే సత్య ప్రకాష్, నాగరాజు మంత్రి కి ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను గురించి వివరించడం జరిగింది .గత ప్రభుత్వం వల్ల 9వ పి ఆర్ సి లోని ఆర్థిక అంశాలు అందించడంలో ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని, అందువల్ల కూటమి ప్రభుత్వం 11వ పి ఆర్ సి ని వెంటనే నియమించాలని 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, కరువు బత్యం ప్రకటించాలని ,2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు చేయాలని, పెన్షనర్ల కరువు భత్యం పై రూట్ మ్యాప్ ప్రకటించాలని, మెడికల్ బిల్లులు ,హెల్త్ కార్డుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి కి వివరించారు. అందుకు మంత్రి ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు వీర కుమార్ రెడ్డి ,ఆర్థిక కార్యదర్శి వై మనోహర. జిల్లా నాయకులు కేఎం నాగరాజు, పూజారి శ్రీనివాసులు, అవుకు మండలం ప్రధాన కార్యదర్శి ఎం విజయ్ కుమార్ ,కే గోపాల్ ,సిపిఎస్ కన్వీనర్ మల్లికార్జున్ రావు ,సుధీర్ ,శేఖర్ ,కాసిం భాష, పుల్లయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ



**మంత్రాలయం న్యూస్:-** ప్రభుత్వం నుంచి కొత్తగా మంజూరైన పట్టాదారు పాస్ బుక్ లను తహసీల్దార్ కె రమాదేవి పంపిణీ చేశారు. సోమవారం మండల పరిధిలోని సింగరాజనహల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి టిడిపి మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో 868 ఎకరాల భూమి ఉండగా సుమారు 289 మంది రైతులకు ఈ పుస్తకాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఈనెల 2వ తారీఖు నుండి 9వ తారీఖు వరకు కొనసాగుతుందన్నారు. కావున రైతులు అందరూ ఇబ్బందులు పడకుండా పుస్తకాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీ-సర్వే డిటి సరస్వతి, ఆర్ ఐ జనార్ధన్ రావు, విఆర్ఓలు నాగేష్, మల్లికార్జున టిడిపి నాయకులు గంగన్న, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల ఆర్థిక చేయూత

వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి గ్రామానికి చెందిన సూగూరి రాములమ్మ సోమవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోతేపల్లి సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి తగుళ్ళ కొండల్ యాదవ్ పరామర్శించి పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా సర్పంచ్ రూ. 5 వేలు, గ్రామ సీనియర్ నాయకురాలు ఎడ్మ శాంతమ్మ వెంకట్ రెడ్డి రూ. 3 వేలు, పోతేపల్లి గ్రామపంచాయతీ బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి తగుళ్ల అంజి మాస్టర్ ఆర్థిక సాయం రూ. 3 వేల రూపాయలు అందజేశారు.

## అమ్మవారి హుండీ ఆదాయం 2.17 లక్షలు

### - శ్రీశైలం దేవస్థానం డీప్యూటీ కమీషనర్ రవణమ్మ



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండల పరిధిలోని కొలనుభారతి దేవి క్షేత్ర అమ్మవారి హుండీ ఆదాయం రూ.217635 వచ్చిందని శ్రీశైలం దేవస్థానం డీప్యూటీ కమీషనర్ రవణమ్మ అన్నారు. సోమవారం శివపురం సమీపంలోని కొలనుభారతి క్షేత్ర ప్రాంగణంలో ఏఈఓలు ఫణీందర ప్రసాద్, హరిదాస్ల ఆధ్వర్యంలో అమ్మవారి హుండీ లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా డీప్యూటీ కమీషనర్ మాట్లాడుతూ గత నాలుగు నెలల హుండీని లెక్కింపుచేశామన్నారు. ఇందులో రూ.217635 ఆదాయం వచ్చిందన్నారు. దీంతో పాటు 10 గ్రాముల బంగారు, 350 గ్రాముల వెండి అమ్మవారికి భక్తులు ఇచ్చారన్నారు. ఈ మొత్తాన్ని అమ్మవారి ఖాతాలో భద్రపరుస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటనాయుడు. దేవదాయశాఖ ఇన్స్పెక్టర్ హరిశ్చంద్రా రెడ్డి, ఏసీ పాండురంగారెడ్డి, ఈఓ రామలింగారెడ్డి, సూపరెండెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రెవరెండ్ మద్దెల ఆనంద్ కుమార్‌కు ఘనంగా పదవీ విరమణ సభ



**కలసపాడు ఫిబ్రవరి 2 (నంది పత్రిక):** మండల కేంద్రమైన కలసపాడులో సగిలేరు నది ఒడ్డున ఉన్న ఎస్పీజీ పరిశుద్ధ పేతురు పరిశుద్ధ పౌలు దేవాలయంలో డీనరీ చైర్మన్‌గా సేవలందించిన రెవరెండ్ మద్దెల ఆనంద్ కుమార్ గారి పదవీ విరమణ సభను చర్చి ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి డీనరీ చైర్మన్ రెవరెండ్ బండి శామ్యూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా నంద్యాల డయాసిస్ బిషప్ ది రైట్ రెవరెండ్ కామనూరి సంతోష్ ప్రసన్నరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బిషప్ సంతోష్ మాట్లాడుతూ గురువు వృత్తి పవిత్రమైనదని, రెవరెండ్ ఆనంద్ కుమార్ గారు 24 సంవత్సరాల పాటు సంఘానికి అందించిన సేవలు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. అనంతరం బిషప్ దంపతులు, కమిటీ సభ్యులు, సంఘస్తులు, బంధువులు తదితరులు రెవరెండ్ ఆనంద్ కుమార్ గారిని ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. భోజన విందును రెవరెండ్ ఆనంద్ కుమార్ బాబు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీనరీ చైర్మన్ రెవరెండ్ బండి శామ్యూల్, ప్రెస్బిటర్ రెవరెండ్ ఆశిష్ గాబ్రియేల్, రెవరెండ్ డాక్టర్ పెరుమాళ్ళ వరప్రసాద్, రిటైర్డ్ డీసీ జేసీ ప్రభాకర్, రెవరెండ్ అక్కిదాసరి జాన్సన్ విజయ్ కుమార్, రెవరెండ్ గద్ద మధుకర్, రెవరెండ్ పల్లవోలు అనిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కమిటీ సభ్యులు బత్తుల కిషోర్, పెద్దిటి సైమన్, కలసపాటి రత్నరాజు, పల్లవోలు కమలాకర్, కారు శకుంతలమ్మ, పబ్బతి ప్రసన్న, వసంత కుమారి, మేస సరళ సలోమి, సింగమల, కీర్తికావేరి, యేసుదాస్, స్వామిపాదం, డేవిడ్, వరదరాజు, విజయజ్యోతి, గీతారూత్, బేబీ సరోజ, సలోమి, స్టీఫెన్, కారు జె. ప్రవీణ్ కుమార్, యెషయా, శ్యామ్ సంగీతరావు, సుధానంద్, జోయెల్ రాజు, మోజస్, రవి, సునీల్, వినీల్, ప్రభు కుమార్, రిచర్డ్స్, మార్టిన్, ప్రవీణ్‌తో పాటు సంఘస్తులు, స్త్రీల మైత్రి సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కార్మికుల హక్కుల కోసం దేశవ్యాప్త సమ్మె.... సిఐటియు



**కోవెలకుంట్ల ఫిబ్రవరి 2నందిపత్రిక** కార్మికుల హక్కుల కోసం 12 న దేశవ్యాప్త సమ్మె నిర్వహించడం జరుగుతుందని సమ్మెను జయప్రదం చేయాలని పజాసంఘాలు పిలుపునిచ్చారు సోమవారం కోవెలకుంట్ల పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపి అనంతరం తాసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు సుధాకర్, ఏఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు కరీం బాషా మాట్లాడుతూ ఫిబ్రవరి 12 తేదీన దేశవ్యాప్తంగా 20 కోట్ల కార్మికులు తమ హక్కుల కోసం సమ్మె నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా ఉపాధి హామీ చట్టం పేరు మార్పు అదేవిధంగా చట్టాన్ని తొలగించి స్కీమ్ గా ఏర్పాటు చేయడం సరైంది కాదు అని వెంటనే దానికి విరమించుకుని పాత చట్టాన్ని అమలు చేయాలని, అలాగే కార్మికులకు నష్టం కలిగిస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దుచేసి పాత కార్మిక 29చట్టాలు యధావిధిగా అమలు చేయాలని వారు కోరారు. అలాగే స్కీం వర్కర్లకు, స్వచ్ఛభారత్ కార్మికులకు ఉపాధికి సంబంధించి నిన్న ప్రవేశపెట్టిన బడ్జెట్లో తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఈ బడ్జెట్లో కేటాయింపులు తక్కువ ఉన్నాయని వారు కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండించారు. కావున ఈనెల 12న దేశవ్యాప్తంగా జరిగి సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి ,సరస్వతి, రంగమ్మ, దేవి ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాములమ్మ, వెంకటరెడ్డి, దిబ్బరాజు, స్వచ్ఛ భారత్ కార్మిక సంఘం కార్యదర్శి త్యాగరాజు, సిఐటియు నాయకులు కిరణ్, నరేష్ ,రాముడు,సుబ్బారెడ్డి,ఆర్టీసీ యూనియన్నాయకుడుబాలయ్యమరియుకార్మికులు పాల్గొన్నారు.

## గిరిజన సంఘం అధ్యక్షుడికి ఘన సన్మానం

మండల గిరిజన సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన రత్లావత్ అజిత్ నాయక్ ను సోమవారం వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అజిత్ నాయక్ జీవితంలో మరిన్ని ఉన్నత పదవులు అనుభవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బస్నమోని శ్రీను ముదిరాజ్, బలగట్టు తండా సర్పంచ్ కేస్య నాయక్, ఉప సర్పంచ్ జీవుల నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొయ్యల పుల్లయ్య, చిమ్ముల తిరుపతిరెడ్డి, ఎండి రషీద్, వార్డు సభ్యులు పురుషోత్తం చారి, గోసుల కొండయ్య, ఈదులపల్లి శ్రీనివాసులు ,రాహుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకానికి 20 ఏళ్లు కూలీలకు రోజువారీ వేతనం పెంచాలి

### కాంగ్రెస్ నేత పగడాల నరసింహ



**బద్వేల్, ఫిబ్రవరి 2 ( నంది పత్రిక ):** మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం జీ ఎన్ ఆర్ ఇ జి ఎ) అమలులోకి వచ్చి నేటితో 20 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా బద్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నరసింహ మాట్లాడుతూ,"విబిజీ రామ్ వద్దు ఎం జీ ఎన్ ఆర్ ఇ జి ఏ ముద్దు" అని నినాదం చేశారు. ఉపాధి హామీ కూలీలకు రోజువారీ కూలి పెంచాలని, పాత పద్ధతినే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు 90 శాతం నిధులు అందజేయాలని, ప్రస్తుతం ఉన్న పని దినాలను 120 రోజులకు పెంచి కూలీల వేతనం పెంచాలని కోరారు. అలాగే మహాత్మ గాంధీ పేరును యథాతథంగా కొనసాగించాలని బద్వేల్ పట్టణ కాంగ్రెస్ కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ పట్టణ అధ్యక్షుడు పగడాల నరసింహతో పాటు కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అచ్చుతరాజు, జిల్లా మహిళా నాయకురాలు సుభానబీ, బద్వేల్ మండల అధ్యక్షుడు అంబవారం సుధాకర్ రెడ్డి, గోపవరం మండల అధ్యక్షుడు సాంబయ్య పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ మరింత వేగవంతం చేయాలి

### కర్నూలు నియోజకవర్గ ఆర్వో, కమిషనర్ పి.విశ్వనాథ్ ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు పురోగతిపై సమీక్ష



**కర్నూలు నంది పత్రిక.....** కర్నూలు నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని కర్నూలు నియోజకవర్గ ఆర్వో, కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నియోజకవర్గంలో జరుగుతున్న ఎస్ఐఆర్ అమలు పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. వివిధ బూత్‌ల పరిధిల్లో ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ డేటా సేకరణలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో ఎస్ఐఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఈ ఆర్వో, తహశీల్దార్ రవికుమార్, అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ విష్ణుమూర్తి, డిసిపి వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.

## మీ భూమి మీ హక్కు పట్టాదారు పాస్ బుక్కుల పంపిణీ



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 2, నంది పత్రిక** ఆళ్లగడ్డ మండల పరిధిలోని ఎస్ లింగందిన్నె గ్రామంలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మీ భూమి మీ హక్కు పట్టాదారు పాస్ బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పబ్లిసిటీ పిచ్చితో జగన్మోహన్ రెడ్డి పాసుబుక్కుల మీద సర్వే రాళ్లపై ఎక్కడపడితే అక్కడ ఆయన బొమ్మ వేపించుకొని ప్రజల సొమ్మును వృధా చేయడం జరిగిందన్నారు. మన ప్రభుత్వం వచ్చాక అలా కాకుండా పట్టా పాస్ బుక్కు మీద రాజముద్ర వేపించి ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వం భూములు కనబడితే చాలు కబ్జాలు చేసే రాపించుకోవడం జరిగిందని ఆర్ కృష్ణాపురం గ్రామంలో 400 ఎకరాల ప్రభుత్వము ఉందని తెలుసుకొని అది ప్రజల కోసం అని చెప్పి పరిశ్రమలు కట్టించడానికి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు ఇప్పించడానికి వాటిని వాడడం జరుగుతుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు గత ప్రభుత్వంలో సర్పంచ్ నిధులను కొట్టేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కే దక్కిందని మన ప్రభుత్వం అలా కాదని సర్పంచులు ఏ పార్టీ వారైనా సరే ప్రజలకు ఉపయోగపడేలాగా నిధులు అందిస్తున్నామని సీసీ రోడ్లు డ్రైనేజీలు స్తంభాలు ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఎవరికి జీతాలు సమయానికి అందేవి కాదని మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒకటో తారీకు ని ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి జీతాలు అందుతున్నాయని అలాగే ఒకటో తారీకు ఉంది పెన్షన్ కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు ఇది మంచి ప్రభుత్వం మన ప్రజల ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్ బేగం, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## యాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామికి పల్లకి సేవ



**బనగానపల్లె ఫిబ్రవరి 2నందిపత్రిక** సోమవారం సందర్భముగా యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామిఅమ్మవార్ల పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమము నందు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పాండురంగా రెడ్డి, ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వర రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేష్ రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యంగా ఉండేందుకు ఆర్గానిక్ ఉత్పత్తులను స్వీకరించాలి...

### ఆర్గానిక్ ఉత్పత్తులపై అవగాహన కలిగి, కొనుగోలు చేయడం ద్వారా రైతులను ప్రోత్సహించాలి...

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 2 నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్లో ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించి, గృహంలో వినియోగించే కొన్ని వస్తువులను స్వయంగా డబ్బు చెల్లించి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పురుగుమందులు, ఎరువులు లేకుండా ఏ పంటను పండించడం లేదని, తద్వారా అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు.
ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలన్నారు. దీనికి ఆర్గానిక్ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని, ఆర్గానిక్ ఉత్పత్తులు రుచిలో కూడా చాలా బాగుంటాయని తెలిపారు. పిజిఆర్ఎస్ కి వచ్చే ప్రజలు, కలెక్టరేట్ సిబ్బందికి అందుబాటులో ఉంచేందుకు ప్రతి సోమవారం ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే ఆరోగ్యం అంతమైన దుస్తులను ధరించేందుకు చేనేత వస్త్రాల అమ్మకాలను కూడా ప్రదర్శించడం జరిగిందని, వీటిని కూడా కొనుగోలు చేసి ప్రోత్సహించాలన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తేనే మరింత మంది రైతులు ఆర్గానిక్ ఉత్పత్తుల పండించడానికి ముందుకు వస్తారని తెలిపారు. ఆర్గానిక్ ఉత్పత్తులు దిగుబడి తక్కువగా ఉన్న ప్రజలు మేలుకోరి కొంతమంది అభ్యుదయ రైతులు ఆర్గానిక్ ఉత్పత్తులను పండిస్తున్నారని వారు ప్రజలకు చేస్తున్న మేలు మరువరానిది అన్నారు. ప్రజలందరూ ఆర్గానిక్ కూరగాయలు, ఇతర ఉత్పత్తులను, చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని తెలిపారు. విస్సా కోడేరు వంతెన వద్ద ఏర్పాటుచేసిన ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకాల దుకాణంలో ప్రతిరోజు ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రజలకు ఎక్కువ మొత్తంలో అందుబాటులో ఉంచాలని డిఆర్డిఏ అధికారులకు సూచించారు.

## జిల్లాలో పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా వందరోజుల ప్రణాళిక పక్కాగా అమలుకు ఉపాధ్యాయులు కృషి చెయ్యాలి: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 2 నంది పత్రిక** పదవ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతలో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్న వంద రోజులు యాక్షన్ ప్లాన్ అమలును పరిశీలించేందుకు సోమవారం సాయంత్రం భీమవరంలోని ఎస్ హెచ్ బి ఆర్ ఎం హైస్కూల్ నందు ప్రత్యేక తరగతులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంలో ఆదివారం, ఈరోజు నిర్వహించిన పరీక్ష పేపర్లను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలు నూరు శాతం సాధించే లక్ష్యంగా ఏర్పాటుచేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో ఊహించని విధంగా ఫలితాలు ఉండాలని, ఇందుకు తగిన విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి అన్నారు. జిల్లాలోని పదవ తరగతి విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రతిరోజూ ఉదయం 8.00 గంటలకే పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని, అలాగే సాయంత్రం నాలుగు నుండి ఐదు గంటల మధ్య ప్రతిరోజు మాక్ టెస్ట్ నిర్వహించాలన్నారు. ఈరోజు ఫలితాలను రేపు వెల్లడించి ఆ విద్యార్థులు ఏ సబ్జెక్టు నందు వెనకబడి ఉన్నారో పరిశీలించాలన్నారు. ఆ విద్యార్థులపై మరింత శ్రద్ధ కనపరచాలని సూచించారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ లో ఇప్పటికే 57 రోజులు గడిచిపోయాయని, మిగిలిన 43 రోజులు కూడా శ్రద్ధగా తరగతులు నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తుకు మంచి బాట వేయాలని తెలిపారు. వారు చదువు కొనసాగించాలో ఇప్పటితో ఆగిపోవాలో అంతా మీ చేతిలోనే ఉందని, చాలామంది పదవ తరగతి తప్పితే ఆ విద్యార్థులు చదవడం మానేస్తారని, అటువంటి వారిని ఉత్తీర్ణతతో చదువులు ముందుకు కొనసాగేలా చూసే గురుతర బాధ్యత మీపై ఉందని మరిచిపోవద్దన్నారు. మీరు ఎంత శ్రమ పడితే విద్యార్థులు అంత ప్రగతిని సాధిస్తారని, రానున్న ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా అగ్రస్థానంలో ఉండేలా అందరి కృషి ఫలించాలన్నారు. ఈ సందర్భంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.



## కల్వకుర్తిలో మున్సిపల్ ఎన్నికల బీఫారాల సందడి



**కల్వకుర్తి ఫిబ్రవరి 02 ప్రతినిధి/** కల్వకుర్తి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులకు కల్వకుర్తి పట్టణ కేంద్రంలో సోమవారం బీ ఫారాలు అందజేశారు. బి ఫారాల పంపిణీకి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జి, రాష్ట్ర పొల్యూషన్ కమిటీ సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్ లు అభ్యర్థులకు బీఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకే బీపారాలు లభించాయని, గెలుపు గుర్రాలకి కాంగ్రెస్ పార్టీ బీఫారాలు కేటాయించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితి విజయ్ కుమార్ రెడ్డి,కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి,సీనియర్ నాయకులు జిల్లెల రాములు, మున్సిపల్ వార్డు అభ్యర్థి మబ్బు రామరాజు, హోటల్ శ్రీను, మరియు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మిక, కర్షక దేశ వ్యాప్త సమ్మెను కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలి.



**కేసముద్రం, ఫిబ్రవరి 02(నంది పత్రిక):** కేసముద్రం మండలం కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ప్రజా సంఘాల జనరల్ బాడీ సమావేశం తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు నీరుటి జలందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోడిశాల వెంకన్న మాట్లాడుతూ 2026 ఫిబ్రవరి 12న దేశ వ్యాప్తంగా జరిగే కార్మిక, కర్షక, గ్రామీణ సమ్మెలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా తీసుకు వచ్చిన చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుడికి పనికి తగిన వేతనం అడిగే హక్కు లేకుండా నూతన కార్మిక చట్టాలను తీసుకు వచ్చి కార్మిక హక్కులను కాలరాసే విధంగా చట్టాలను కఠినంగా అమలు చేయాలని చూస్తున్నారని, వెంటనే ఈ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకులు బండి దుర్గా ప్రసాద్, సింగిరెడ్డి కరుణాకర్, సోమారపు ఎల్లయ్య, షేక్ రజాక్ మియా, సారయ్య, తులసిమొగ్గ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపు 1వ వార్డు అభివృద్ధికి మలుపు:అల్లం నాగేశ్వరరావు.



**కేసముద్రం, ఫిబ్రవరి 02(నంది పత్రిక):** ఈ నెల 11 న కేసముద్రం మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా 1వ వార్డు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి బండి సుజాత ప్రభాకర్, 13వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కేసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ అల్లం రమ-నాగేశ్వర్ రావు గెలుపే లక్ష్యంగా బ్రహ్మంగారి గుడి తండాలో, 13వ వార్డులో హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు గడప గడప తిరుగుతూ అభ్యర్థించారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను వివరించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని గుర్తు చేసుకొని, ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇప్పటికే వందల కోట్ల నిధులతో కేసముద్రం మున్సిపాలిటీలో ప్రజా ప్రభుత్వం కనీవినీ ఎరగని రీతిలో చేస్తున అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, జిల్లా రవాణా అథారిటీ సభ్యులు రావుల మురళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిదురాల వసంతరావు, మాజీ వార్డు సభ్యులు బానోత్ బాలు నాయక్, ఇస్లావత్ రాజు, బదవత్ సుమన్, బానోత్ నరేష్, ధరంసోత్ సేవల్, బానోత్ శ్రీను, బానోత్ వెంకన్న, బాలోజీ, గణేష్, శంకర్, ధర్మ, అలీ, మురారి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం కప్ మండల స్థాయి పోటీలను ప్రారంభం.




**కేసముద్రం, ఫిబ్రవరి 02(నంది పత్రిక):** సీఎం కప్ మండల స్థాయి క్రీడలలో ఉత్తమ ప్రతిభ చూపి నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని కేసముద్రం తహశీల్దార్ జి.వివేక్ క్రీడాకారులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సెయింట్ జోన్స్ హైస్కూల్ క్రీడామైదానంలో సీఎం కప్ క్రీడలను తహశీల్దార్ జి.వివేక్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం కబడ్డీ, ఖో ఖో, అథ్లెటిక్స్, వాలీబాల్ తదితర క్రీడలలో పోటీలు నిర్వహించారు. క్లస్టర్ లెవెల్లో ఎంపికైన క్రీడాకారులు మండల స్థాయిలో 150 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు లాల్ బహుదూర్, ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ సీనియర్ ఉపాధ్యాయులు డాక్టర్ కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్, దామల్ల విజయ చందర్, కే.పద్మ, స్రవంతి, విజయనిర్మల, తారక, వీరన్న, వెంకన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిపల్లిలో చిత్తరమ్మ జాతరలో ఎంపీ ఈటెల రాజేందర్



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం యాదగిరిపల్లిలో జరుగుతున్న చిత్తరమ్మ బోనాల ఉత్సవాలలో పాల్గొన్న ఈటల రాజేందర్ గారు. ఆయనతో పాటు ఏనుగు సుదర్శన్ రెడ్డి, బాలరాజ్ యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభలవీడులో ధనమ్మ గారి మృతికి నల్లేరు విశ్వనాథ రెడ్డి నివాళులు



**బి కోడూరు ఫిబ్రవరి 2 (నంది పత్రిక ):** బి.కోడూరు మండలం ప్రభలవీడు గ్రామ పంచాయతీ సర్పంచ్ నాగిరెడ్డి జయరామిరెడ్డి వదిన ధనమ్మ (చెన్నారెడ్డి భార్య) ఈరోజు ఉదయం అనారోగ్య కారణాల వల్ల పరమపదించారు.ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.కోడూరు మండలానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొని మృతురాలికి నివాళులు అర్పించారు.

## ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 36వినతులు.

### కమిషనర్ ఎన్. మౌర్య.




**తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 2 నంది పత్రిక** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 36 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 26మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ కమిషనర్ ను కోరారు. రాయల్ నగర్ 7వ క్రాస్ వద్ద ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ ఉండడం వలన ట్రాఫిక్ ఇబ్బందిగా ఉందని, చంద్రశేఖర్ కాలనిలో డ్రైనేజి కాలువలు ఏర్పాటు చేయాలని, ఎస్. కె. డి. నగర్ నందు డ్రైనేజి కాలువలను ఎలుకలు లోడేయడం వలన మురుగునీరు రోడ్లపైకి వస్తున్నాయి అరికట్టాలని, లక్ష్మీపురం కూడలి మూసివేయడం వలన ఇబ్బందిగా ఉండి పరిష్కరించాలని, కొరమీనుగుంట లో ఏర్పాటు చేయనున్నారు సెల్ టవర్ నిలుపుదల చేయాలని, టి. నగర్ లో కాలువలు శుభ్రం చేసి, దోమలు రాకుండా చర్యలు చేపట్టాలని, ఎస్. కె. డి. నగర్ లోని మునిసిపల్ స్కూల్ వద్ద శిథిలావస్థ లో ఉన్న చెట్టును తొలగించాలని, గ్రీనపార్క్ అపార్ట్మెంట్ వెనుక పాడయిపోయిన కాలువలు మరమ్మతులు చేయాలని, నెహ్రూ నగర్ లో అంబులెన్సు వచ్చేందుకు ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని, ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఆక్రమణకు గురైన రోడ్డును కాపాడాలని, ఎస్. ఎల్. ఎఱ. నగర్లో తెలుగుగంగా నరు సరఫరా చేయాలని, సంజయ్ గాంధీ కాలని, సాయి విష్ణు లే ఔట్ లో అక్రమ నిర్మాణలను అరికట్టాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్,డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## జిల్లాలో 77,500 వేల పట్టాదారు పుస్తకాలను రైతులకు అందించాం: జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి



**ఏలూరు/లింగపాలెం బ్యూరో చీఫ్, ఫిబ్రవరి, 2 నంది పత్రిక:** "మీ భూమి మీ హక్కు" కార్యక్రమం ద్వారా జిల్లాలో 77 వేల 500 రాజముద్రతో ముద్రించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు అందించామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. లింగపాలెం మండలం గణపావారిగూడెం గ్రామంలో చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ తో కలిసి సోమవారం రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రీ సర్వే అనంతరం సవరించిన భూ వివరాలు,ఞ= కోడ్, రాజముద్రతో ముద్రించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామన్నారు. రాజముద్రతో ముద్రించిన పట్టాదార్ పాస్ పుస్తకాల ద్వారా రైతులకు వారి భూమిపై వారికి స్పష్టమైన హక్కులు కల్పిస్తున్నామని , ఞ= కోడ్‌ను స్కాన్ చేయగానే సర్వే నంబర్లు, విస్తీర్ణం, పట్టాదారు పేరు తదితర భూ వివరాలు డిజిటల్ రూపంలో కనిపిస్తాయని, దీనివల్ల రైతులకు తమ భూమి సమాచారం మరింత సులభంగా అందుబాటులో ఉంటుందన్నారు. చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ "మీ భూమి మీ హక్కు" కార్యక్రమం ద్వారా రీ-సర్వే అనంతరం రాజముద్రతో ముద్రించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామన్నారు. రెండవ విడతలో ఈనెల 2వ తేదీ నుండి 9వ తేదీ వరకుక్ ఎంపిక చేసిన గ్రామాలలో పట్టాదారు పాస్‌బుక్కులు పంపిణీ జరుగుతుందని ఎమ్మెల్యే తెలియజేసారు.నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, తహసీల్దార్ నజీముల్లాషా, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, వ్యవసాయ శాఖ ఏడి సుబ్బారావు, రెవిన్యూ అధికారులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మందిరానికి స్థలం కేటాయించాలని వినతి

**వెల్దండ పిబ్రవరి 02 ప్రతినిధి** వెల్దండ మండల కేంద్రంలో గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణానికి స్థలం కేటాయించాలని తహసిల్దార్ కార్తీక్ కుమార్ కు గిరిజన సంఘం నేతలు, ప్రజా ప్రతినిధులు మండల గిరిజన సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన అజిత్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని 56 గిరిజన తండాల్లో సుమారుగా 9 నుండి 11వేల జనా ఉందని ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లారు. ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు శంకర్ నాయక్, సర్పంచ్ రమేష్ నాయక్, కేశ్య నాయక్,ఉప సర్పంచ్ జీవుల నాయక్,రవీందర్ నాయక్, నాగులు నాయక్, నారాయణ నాయక్, గోపాల్ నాయక్, అంజి నాయక్, నర్సింగ్ నాయక్,రాహుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలులో అధికారులు చిత్తశుద్ధితో పనిచేసే మంచి ప్రగతి సాధించాలి.





## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

**తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 2 నంది పత్రిక** పీజీ ఆర్ఎస్ సమావేశం అనంతరం సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వాట్సాప్ గవర్నెన్స్, ఐ గాట్, ఈపిటిఎస్ పోర్టల్ లో ఫైల్స్ అప్లోడింగ్, పీ4, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్, పీ 4, ఈపిటిఎస్ ఫైల్స్ అప్లోడింగ్, ఐగాట్ పోర్టల్ ప్రభుత్వ ఉద్యోగుల ఆన్లైన్ కోర్సులు తదితర కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, కావున అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేసి మంచి పురోగతి సాధించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రజలు వాట్సాప్ సేవలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ఐగాట్ ఆన్లైన్ కోర్సులపై సమీక్షిస్తూ ప్రభుత్వ ఉద్యోగులు తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఐ గాట్ పోర్టల్లో వందలాది ఆన్లైన్ కోర్సులు ఉన్నాయని, ప్రతి ఉద్యోగి వారికి నచ్చిన కోర్సులు చేయడం ద్వారా తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. జిల్లా అధికారులు తమ సిబ్బందితో వారికి అనువైన కోర్సులు చేసే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శాఖల వారి ప్రగతిని సమీక్షించి మంచి పురోగతి సాధించాలన్నారు. ఈపిటి ఎస్ ఫైల్స్ అప్లోడింగ్ పై సమీక్షిస్తూ ప్రభుత్వ కార్యాలయాలలోని ప్రతి ఫైలు, ప్రొసీడింగ్స్, సర్క్యులర్స్, జీవోలు తప్పనిసరిగా ఇపిటిఎస్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు ఫైల్స్ అప్లోడింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి మండలానికి లక్ష్యాలు నిర్దేశించడం జరిగిందని లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు కృషి చేయాలి అన్నారు. పి 4 ఫోర్ సమీక్షిస్తూ పేదరికం లేని సమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి అత్యంత ప్రతిష్టాత్మకంగా పి -4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని వారి లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. మార్గదర్శిల ద్వారా బంగారు కుటుంబాలకు ఏ విధంగా సహాయం అందుతున్నది తెలుసుకోవాలన్నారు. సహాయం అందకపోతే వారిని కలిసి కారణాలు తెలుసుకొని మరొక మార్గదర్శిని అనుసంధానం చేసి బంగారు కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని. ఇప్పటికే ఎంపిక చేసిన మార్గదర్శలను బంగారు కుటుంబాలకు అనుసంధానం చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడి డాక్టర్ కె. సి హెచ్ అప్పారావు, స్వర్ణ గ్రామ,స్వర్ణ వార్డు జిల్లా అధికారి వై.దోసి రెడ్డి, డిపిఓ ఎం.రామనాథరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# తెలంగాణ సిపిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యత్వ సేకరణ.



**కేసముద్రం, ఫిబ్రవరి 02(నంది పత్రిక)**:తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కేసముద్రం జడ్.పి ఉన్నత పాఠశాలలో సభ్యత్వ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవిచంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని, రిటైర్డ్ అయిన సిపిఎస్ ఉద్యోగుల పెన్షన్ ఆసరా పెన్షన్ల కంటే తక్కువగా వస్తుందని, ప్రభుత్వం ఉద్యోగులు జమ చేసిన సొమ్మును స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం వలన స్టాక్ మార్కెట్ హెచ్చుతగ్గులకు అనుగుణంగా సిపిఎస్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని, కావున రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ ప్రవేశపెట్టి సిపిఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఈ.భాస్కర్, జిల్లా బాధ్యులు వై.అశోక్, జి,యాదగిరి, బి.రాములు, రఫీ పాషా, రఘు, ప్రసాద్, రత్న కుమారి, పద్మ, వెంకటేశ్వర్లు, మోహనకృష్ణ, కృష్ణ, భాస్కర్ రావు, శ్రీలత స్వప్న, దీపిక తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం

**భట్టి విక్రమార్క, ఉప ముఖ్యమంత్రి లి**
**రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు శూన్యం**
**ఫార్మా, ఎలక్ట్రానిక్స్, టూరిజం వంటి కీలక రంగాల్లోనూ మొండిచెయ్యి**
**రాష్ట్ర విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోలేదని భట్టి విక్రమార్క ఆవేదన**
**నిధుల కోసం ఎంపీలంతా ఏకతాటిపైకి రావాలని పిలుపు**

**హైదరాబాద్ సెక్రటేరియట్ ఫిబ్రవరి 2 (నంది పత్రిక)**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. ఆదివారం నాడు పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన రూ.53.47 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో రాష్ట్రానికి ఆశించిన కేటాయింపులు ఏవీ దక్కలేదని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంపీలు పలుమార్లు ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రిని కలిసి రాష్ట్ర ప్రయోజనాల కోసం విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందని భట్టి మీడియాకు తెలిపారు. మూసీ నది ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ నగర అభివృద్ధి, మెట్రో రైల్ విస్తరణ వంటి కీలక ప్రాజెక్టులకు నిధులు వస్తాయని ఆశించామని, కానీ కేంద్రం మొండిచెయ్యి చూపిందని అన్నారు.ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్ ఫార్మా హబ్‌గా గుర్తింపు పొందిందని, కరోనా సమయంలో భారత్ బయోటెక్ ప్రపంచానికే వ్యాక్సిన్లు అందించిందని గుర్తుచేశారు. అయినా ఫార్మా హబ్ కార్యక్రమాల్లో తెలంగాణకు చోటు దక్కకపోవడం దారుణమన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగానికి బడ్జెట్‌లో రూ.40,000 కోట్లు కేటాయించినా, ఇప్పటికే అభివృద్ధి చెందిన హైదరాబాద్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఆడియో-వీడియో, గేమింగ్, కామిక్స్‌కు కేంద్రమైన హైదరాబాద్‌ను కాదని, 'ఆరెంజ్ ఎకానమీ' కార్యకలాపాలను ముంబైకి తరలించడం అన్యాయమని అన్నారు. అంతేకాకుండా, టూరిజం, మెడికల్ హబ్, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి రంగాల్లోనూ తెలంగాణను విస్మరించారని ఆరోపించారు. సెమీకండక్టర్ యూనిట్ కోసం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రధానిని కోరినా, ఆ




ప్రాజెక్టులను ఇతర రాష్ట్రాలకు కేటాయించి తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిందని భట్టి విమర్శించారు. తమకు 4 శాతం ఆర్థిక లోటుకు అనుమతివ్వాలని కోరితే నిరాకరించిన కేంద్రం, తనకు తానుగా 4.3 శాతం ఆర్థిక లోటు నిర్దేశించుకుందని దుయ్యబట్టారు. "తెలంగాణ ఈ దేశంలో అంతర్భాగం కాదా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ ఎంపీలందరూ పార్టీలకు అతీతంగా ఏకమై, నిధుల కేటాయింపు కోసం ప్రధాని, ఆర్థిక మంత్రిపై ఒత్తిడి తేవాలని భట్టి విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ పై వ్యతిరేకతతో బిఆర్ఎస్ లోకి భారీ చేరికలు.



**కేసముద్రం, ఫిబ్రవరి 02(నంది పత్రిక)**: రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రజాపాలనతో చేస్తున్న అరాచకాలకు, ఇచ్చిన హామీలను నెరవేర్చలేని ప్రభుత్వ తీరుకు ప్రజలు ఎంతగానో విసిగి పోతున్నారని కేసముద్రం మున్సిపల్ ఎన్నికల కోఆర్డినేటర్ వై.సతీష్ రెడ్డి, మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ లు అన్నారు. సోమవారం కేసముద్రం మున్సిపల్ పరిధి 15వ వార్డుకు చెందిన గిర్ని తండా గిరిజన నాయకులు బదావత్ శ్రీనుతో పాటు 150 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ లో చేరారు. బిఆర్ఎస్ మండల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సతీష్ రెడ్డి, శంకర్ నాయక్ లు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు, ప్రజలు యువకులు, ఉద్యోగస్తులతో పాటు ప్రతి ఒక్క సామాజిక వర్గానికి చెందిన వారు కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మోసం చేసిందని శంకర్ నాయక్ తెలిపారు. బిఆర్ఎస్ లో చేరిన ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని, పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని, మున్సిపల్ ఎన్నికల్లో అందరం సమిష్టిగా కృషిచేసి కేసముద్ర మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగిరేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, సీనియర్ నాయకులు రావుల రవిచంద్ర రెడ్డి, మర్రి రంగారావు, మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి టౌన్ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్, మాజీ మండల అధ్యక్షుడు జాటోత్ హరీష్ నాయక్, గుంజపడుగు కొమ్మాలు, మోడెం రవీందర్ గౌడ్, కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, సర్పంచులు ఏర్పుల కుమారస్వామి, వాంకుడోత్ రవి నాయక్, బిఆర్ఎస్ నాయకులు ఆగే వెంకన్న, గుణగంటి అశోక్, రుద్ర శ్రీకాంత్, సంజీవ, మేకల సురేష్, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి మున్సిపల్ ఎన్నికల కార్యాలయం ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు.



**కేసముద్రం, ఫిబ్రవరి 02(నంది పత్రిక)**:మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కేసముద్రం మున్సిపల్ కేంద్రంలో సోమావారం బిజెపి మున్సిపల్ ఎన్నికల కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా బిజెపి కార్యకర్తలతో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేసముద్రం మున్సిపాలిటీలో పార్టీ కార్యకర్తలు పార్టీ టిక్కెట్ ఎవ్వరికీ ఇచ్చినా ఐక్యతతో ఒక్క తాటి పైకి వచ్చి 16 వార్డులలో బిజెపి అభ్యర్థులను గెలిపించి, మున్సిపల్ కార్యాలయంపై బిజెపి జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్దేశించిన కార్యాచరణను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని, ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే పట్టణాలు, నగరాల అభివృద్ధి సాధ్యమనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పొదిల నరసింహ రెడ్డి, జిల్లా నాయకులు తుంపిల్ల శ్రీనివాస్, వోలం శ్రీనివాస్, మండలాధ్యక్షుడు ఉప్పునూతుల రమేష్, మున్సిపల్ కన్వీనర్ బోగోజు నాగేశ్వరాచారి, మండల ప్రధాన కార్యదర్శి బోనగిరి ఉపేందర్, మండల ఉపాధ్యక్షురాలు నాగనబోయిన చంద్రకళ, సీనియర్ నాయకుడు పోలెపల్లి దేవిరెడ్డి, నాయకులు గాంతి వెంకట రెడ్డి, లెంకలపల్లి శ్రీనివాస్, బచ్చు లక్ష్మీనారాయణ, భూక్య బాలు నాయక్, మంగిశెట్టి నాగయ్య, వేముల సతీష్ రెడ్డి, ఎండీ ఖాశిం, వెలిశాల సవిన్, మంద బాబురావు, సింగంశెట్టి మధుకర్, జుజ్జూరి వీరభద్రాచారి, బానోత్ రంగమ్మ, బానోత్ రమేష్, బానోత్ సంపత్, వజ్జా శ్రీనివాస్ రావు, బొల్లోజు వీరన్న, జాటోత్ సురేష్, బొద్దుల సతీష్, కంచు సురేందర్, జంగిటి అనిల్, కోనకటి రవీందర్, వాంకుడోత్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి.

## రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు కేసముద్రంలో విజయవంతం

**కేసముద్రం, ఫిబ్రవరి 02(నంది పత్రిక)**:విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తెలంగాణ రాష్ట్ర 7బ్లాక్ ఖోఖో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జల్లంపల్లి రామస్వామి పిలుపునిచ్చారు. కేసముద్రం మండల కేంద్రంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర 7బ్లాక్ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. 17 సంవత్సరాల బాలుర విభాగంలో మొదటి బహుమతి మెదక్, రెండవ బహుమతి నిర్మల్, మూడవ బహుమతి హైదరాబాద్ జట్లు గెలుచుకున్నాయి. 14 సంవత్సరాల బాలుర విభాగంలో నిజామాబాద్ మొదటి స్థానంలో నిలవగా, భద్రాద్రి కొత్తగూడెం రెండవ, మెదక్ మూడవ స్థానాలను సాధించాయి. 17 సంవత్సరాల బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు విజేతగా నిలవగా, హైదరాబాద్ రెండవ, నల్గొండ మూడవ స్థానాలను పొందాయి. 14 సంవత్సరాల బాలికల విభాగంలో మొదటి బహుమతి నిజామాబాద్, రెండవ బహుమతి నిర్మల్, మూడవ బహుమతి నిజామాబాద్ జట్లు గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ సంజీవ్, సభ్యులు ప్రదీప్, రమేష్ కుమార్, నాగ శివాజీ, జల్లంపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ధరావత్ శోభన్ నాయక్ పుట్టినరోజు వేడుక.



**కేసముద్రం, ఫిబ్రవరి 02(నంది పత్రిక)**:కేసముద్రం మున్సిపాలిటి పరిధిలోని ధన్నసరి సౌలతండకు ధరావత్ శోభన్ నాయక్ పుట్టినరోజు వేడుకను సోమవారం దన్నసరి సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ యువ నాయకుడు బాదావత్ పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యంలో వేడుకలు యువ నాయకుడు పవన్ కళ్యాణ్ గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకల్లో కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, బాదావత్ పవన్ కళ్యాణ్ నాయక్, ప్రశాంత్ రెడ్డి, ధరావత్ రవీందర్, కోర్ర భరత్, సిరికొండ భాస్కర్, శ్రీకాంత్, మంకు యాకుబ్ రెడ్డిలు శోభన్ నాయక్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com